జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 08, ఫిబ్రవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

## వివేకాను చంపించింది జగనే

● దస్తగిరి వెల్లడి





**కడప, మహానాడు:** వైసీపీ అధినేత జగన్ వివేకాను చంపించి నారాసుర చరిత్ర అని రాశారని ఈ కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి సంచలన వ్యాఖ్యలు చేశారు. దస్తగిరి శుక్రవారం కడప జైల్లో విచారణకు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో జైల్లో ఉన్న నన్ను చాలా ఇబ్బంది పెట్టారు. ఆ సమయంలో నన్ను ఇబ్బందిపెట్టిన వాళ్లపై కేసు పెట్టాను. వికేకాను జగన్ చంపించారు. త్వరలోనే అన్ని నిజాలు బయటకి వస్తాయి అని తెలిపారు.

● 'దేశం' ఎటుపోతోంది?

# నిన్న మంగ్లీ.. నేడు నాగార్జున!

- టీడీపీని వ్యతిరేకించిన వారికి రెడ్‌కార్పెట్ వేస్తారా?
- ఏమిటీ ధిక్కారం?.. ఎందుకిలా?
- మంగ్లీని వెంటబెట్టుకుని అరసవల్లి దర్శనం చేయించిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు
- మంగ్లీ చంద్రబాబును తిట్టిన సంగతి రామూకు తెలియదా?
- ఆమె జగన్ కోసం ప్రచారం చేసిన విషయం కూడా తెలియని అమాయకుడా?
- సోషల్‌మీడియాలో విమర్శలు వచ్చినా స్పందించని రామ్మోహన్‌నాయుడు
- రామ్మోహన్‌ను అన్‌ఫాలో చేసిన టీడీపీ అభిమానులు
- ఇప్పుడు టీడీపీ పార్లమెంటరీ ఆఫీసులో జగన్ మిత్రుడు నాగార్జున ప్రత్యక్షం
- జగన్‌కు తిరుగులేని మద్దతుదారుగా నాగ్ ప్రచారం
- అసలు నాగార్జునను పార్టీ ఆఫీసులోకి తీసుకువచ్చింది ఎవరు?
- లావు అనుమతి లేకుండానే నాగ్ పార్టీ ఆఫీసులోకి వచ్చారా?
- లావు ఇంట్లోనే నాగార్జున ఫ్యామిలీకి భోజనం
- ఈ ఎపిసోడ్‌లో వైఎల్పీ ప్రభావం ఎంత?
- నాగార్జున ప్రమోషన్ ఎపిసోడ్‌కు టీడీపీ ఎంపీలు ఎందుకు?
- మండిపడుతున్న సోషల్‌మీడియా పసుపు సైనికులు
- ఈ సర్దుబాటు రాజకీయాలతో పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారంటూ ఫైర్
- పార్టీలో పెరుగుతున్న ధిక్కారధోరణి

మహానాడు ఫోకస్





(మార్తి సుబ్రహ్మణ్యం)

నిన్నటికినిన్న.. వైసీపీకి ఎన్నికల ప్రచారం చేసి, చంద్రబాబు పేరు వింటేనే తనకు కంపరం పుడుతుందని సెలవిచ్చిన ఎస్వీబీసీ మాజీ సలహాదారు, జగన్ ముద్దుల సినిమా పాటల చెల్లెమ్మ మంగ్లీని.. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు వెంటబెట్టుకుని మరీ అరసవల్లి ఆలయంలో దర్శనం చేయించారు.

సరిగ్గా ఒక్కరోజు తర్వాత.. జగనన్న శ్రేయోభిలాషి, తొలి నుంచీ ఎన్టీఆర్ ఫ్యామిలీ అంటే గిట్టని అక్కినేని నాగార్జున, ఢిల్లీ టీడీపీ పార్లమెంటరీ పార్టీ ఆఫీసులో, సకుటుంబ సపరివార సమేతంగా దర్శనమిచ్చారు. ఆయనతో పాటు టీడీపీ ఫ్లోర్‌లీడర్ లావు కృష్ణదేవరాయలు కూడా ప్రధాని వద్దకు వెళ్లిన వారిలో ఉన్నారు. అంతేనా? ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత తన ఇంట్లోనే అక్కినేని కుటుంబానికి విందు ఇచ్చారట.

అసలు క్రమశిక్షణకు ఆరోప్రాణంగా చెప్పుకునే ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ ఎటు వెళుతోంది? పార్టీ సిద్ధాంతాలు ఏమ

య్యాయి? డబ్బున్నవాళ్లంతా కలసి అటకెక్కించేశారా? తమకు టికెట్లు ఇచ్చి, తమను ఈ స్థాయిలో నిలబెట్టిన పార్టీ అంటే పదవులు తీసుకున్న వారికి లెక్కలేకుండా పోయిందా? పార్టీ పరువు పోయినా ఫర్వాలేదు.. తమ వ్యక్తిగత సంబంధాలు, వ్యాపార బంధాలు సజావుగా ఉండాలని కోరుకుంటున్నారా? మరి దీన్నిబట్టి.. పార్టీ ప్రధానమా? వ్యక్తులు ప్రధానమా? వ్యక్తులే ప్రధానమైతే మరి పార్టీ సంగతి ఏమిటి?.. ఇదీ ఈ రెండు ఘటనల నేపథ్యంలో, పసుపు సైనికులు సోషల్‌మీడియా వేదికగా సంధిస్తున్న ప్రశ్నాస్త్రాలు.

గత ఎన్నికల్లో జగన్ మళ్లీ సీఎం కావాలని, అభ్యర్థులను చూసి కాకుండా జగన్‌ను చూసి ఓటేయాలని, ఫ్యానుకు ఓటేస్తే ఐదేళ్లు చల్లగా ఉడవచ్చంటూ ప్రచారం చేసిన సినీ గాయని మంగ్లీ గుర్తుందా?.. పోనీ అధికారం వచ్చిన తర్వాత ఎస్వీబీసీ సలహాదారుగా జగన్ నియమించిన మంగ్లీ తెలుసా?.. యస్. ఆ మంగ్లీని, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్వయంగా వెంటబెట్టుకుని.. అరసవల్లి ఆలయానికి తీసుకువెళ్లిన వైనంపై, టీడీపీ సోషల్‌మీడియా సైనికులు శివాలెత్తారు.

"వైసీపీ పేరు పలకను అన్న చంద్రయ్య శవమయ్యాడు. బాబుగారి పేరు కూడా పలకను అన్న మంగ్లీ విఐపి అయింది" అంటూ టీడీపీ సోషల్‌మీడియా సైనికులు, ఉదయం నుంచి ఒంటికాలిపై లేస్తున్నారు. "మంగ్లీ నేపథ్యం గురించి తెలియని చిన్నపిల్లాడా ఆయన" అంటూ కారాలు మిరియాలు నూరుతున్నారు. రామ్మోహన్ తీరుకు నిరసనగా.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో ఆయనను అన్‌ఫాలో చేస్తున్నారు. దీనికి సంబంధించిన కామెంట్లు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

నిజానికి మంగ్లీ ఆర్టిస్టు అయినప్పటికీ.. మిగిలిన వారిలా కాకుండా నయాపైసా తీసుకోకుండా, జగనన్నపై అభిమానంతో వైసీపీకి విశేష సేవలందించారు. అందుకు ప్రతిఫలంగా అధికారంలోకి వచ్చిన వెంటనే ఆమెకు, జగనన్న ఎస్వీబీసీ సలహాదారుగా నియమించి రుణం తీర్చుకున్నారు. గత ఎన్నికల సమయంలో టీడీపీ సైతం ఆమెతో పాటలు పాడించాలని ప్రయత్నించింది. సహజంగా సినీనటులు, గాయనీగాయకులు రెమ్యూనరేషన్ ఇస్తేనే పనిచేస్తారు.

టీడీపీ కూడా అదే కోణంలో ఆమెను టీడీపీ ఎన్నికల ప్రచార పాటలు పాడమని కోరింది. అయితే తనకు చంద్రబాబు పేరు చెబితేనే కంపరమని నిర్మొహమాటంగా, నిష్కర్షగా కుండబద్దలు కొట్టేసిందట. అంతకముందు కూడా ఆమె అదే చెప్పింది. అలాంటి మంగ్లీని రామ్మోహన్ వెంటబెట్టుకుని, వీఐపీ కోటాలో దర్శనం చేయించటం సహజంగానే పార్టీ శ్రేణుల కడుపుమంటకు

**వైసీపీ పేరు పలకను అన్న చంద్రయ్య శవమయ్యాడు...**

**బాబు గారి పేరు కూడా పలకను అన్న మంగ్లీ VIP అయింది...🙏🙏🙏**

మిగతా.. 2లో

# ట్రిపుల్ 1 ఏపీయే లక్ష్యం!

- స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికకు చేయూతనివ్వండి
- నూతన సాంకేతికత - ఆవిష్కరణలు అవసరం
- నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీని కోరిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో అవకాశాలు - ఆకాంక్షలపై ప్రజంటేషన్




**అమరావతి, మహానాడు:** వన్ ఫ్యామిలీ... వన్ ఏఐ ప్రొఫెషనల్ – వన్ ఎంట్రప్రెన్యూర్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా స్వర్ణాంధ్ర – 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించామని, దీనికి కేంద్ర సాయం అవసరమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీతో అన్నారు. రాష్ట్ర సచివాలయాలనికి శుక్రవారం వచ్చిన సుమన్ బేరీకి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అవకాశాలను, అభివృద్ధి ఆకాంక్షలను ముఖ్యమంత్రి వివరించారు. ఆవిష్కరణలు – సాంకేతికత అందించడం, నూతన విధానాల అమలుకు తోడ్పడటంలో నీతి ఆయోగ్ సహకారాన్ని ఈ సందర్భంగా కోరారు.

ఏపీ ప్రతీ ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధించి 2047 కల్లా 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నెలకొల్పేందుకు, తద్వారా 42 వేల డాలర్ల తలసరి ఆదాయానికి అందరూ చేరుకునేలా ప్రయత్నిస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. నీతి ఆయోగ్ మద్దతు ఉంటే రాష్ట్రం మరింత

మిగతా.. 2లో

# ప్రపంచ బొగ్గు ఉత్పత్తిలో భారత్ రెండో స్థానం!

◆ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




**న్యూఢిల్లీ:** 2047 వికసిత భారత లక్ష్యాల్లో బొగ్గు రంగం చాలా కీలకం. ప్రపంచ బొగ్గు ఉత్పత్తిలో భారత్ రెండో స్థానంలో ఉంది. బొగ్గు నిల్వల్లో ప్రపంచంలో 5వ స్థానంలో ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివరించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద బొగ్గు వినియోగదారుగా భారతదేశం ఉంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బొగ్గు గని గెవరా మన దేశంలో ఉందని తెలిపారు. ఇంకా, ఆయన ఏమన్నా రంటే.. కోలిండియా బొగ్గు మంత్రిత్వ శాఖ కీలకమైన విభాగం. ఈ ఏడాది కోలిండియా

మిగతా.. 2లో

## ఇది ప్రజలను వేధించే పాలన


◆ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్



**హైదరాబాద్,మహానాడు:** ఇది ప్రజాపాలన కాదు. ప్రజలను వేధించే పాలన. పేదల గూళ్లపై బుల్డోజర్లు పంపడంలో ఉన్న ప్రేమ – బడిపిల్లలకు బుక్కెడు బువ్వపెట్టడంలో లేదా? అమృత్ స్కీంను అప్పనంగా బామ్మర్దికి కట్టబెట్టడంలో ఉన్న తెలివి – బుక్కెడు బువ్వకు అలమటిస్తున్న పసిపిల్లల కడుపు నింపడంలో లేదా?

ఆదానికి రాష్ట్రంలోని వనరులు దోచిపెట్టడంలో ఉన్న శ్రద్ధ – ప్రభుత్వ పాఠశాలల దీనస్థితిపై లేదా? మూసీ ప్రక్షాళన పేరుతో మూటలు కట్టి ఢిల్లీకి కట్టలు పంపడంలో ఉన్న ప్రేమ – భవిష్యత్ భారతావని వారసులైన పసిపిల్లల ఆకలి కేకలపై లేదా?

మంత్రుల సంగతి దేవుడెరుగు, ముఖ్యమంత్రి ఇలాకాలోనే బడి పిల్లల పస్తులు. మీ ఢిల్లీ బాసులు .. మీ గల్లీ దోస్తుల ఆకలి తీర్చడం కాదు రేవంత్ .. ముందు మధ్యాహ్న భోజన పథకంపై దృష్టి పెట్టు. ఒక్క పూట ఫోటోలకు ఫోజులిచ్చి ...గప్పాలు కొట్టడం కాదు – నిత్యం గుప్పెడు అన్నం అందుతుందో లేదో సమీక్ష చేసి చూడు.



05

**పత్రాలన్నీ ఫోన్‌లోనే...**



03

**'ఆపరేషన్ అరణ్య' భేష్!**



04

**నకిలీ డాక్యుమెంట్లతో జోగి రమేష్ అనుచరుల మోసం!**

# ఆర్టీజీఎస్ పనితీరు అద్భుతం!

◆ బోత్సావానా ప్రభుత్వ సలహాదారు అర్బన్ బసిమా దబుత





**అమరావతి, మహానాడు:** ఆర్టీజీఎస్ పనితీరు ఆదర్శనీయమని ఆఫ్రికా దేశాల్లో ఒకటైన బోత్సవానా దేశ ప్రతినిధులు ప్రశంసించారు. బోత్సావాన దేశ ప్రభుత్వ సలహాదారు అర్బన్ బసిమా దబుతా శుక్రవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ(ఆర్టీజీఎస్) కేంద్రాన్ని సందర్శించారు. ఆర్టీజీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె. దినేష్ కుమార్ ఆయనకు స్వాగతం పలికి, ఆర్టీజీఎస్ పనితీరు గురించి వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల నుంచి ఆర్టీజీఎస్ వ్యవస్థ రూపుదిద్దుకుందని, అటు ప్రభుత్వానికి, ఇటు పౌరులకు మధ్య ఈ సంస్థ ఒక వారధిగా పని చేస్తోందన్నారు.

ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న మెరుగైన సేవలు అందించడంలో ఆర్టీజీఎస్ సాంకేతిక సహకారాన్ని అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల మధ్య ఉన్న డేటా అనుసంధానం చేసి ఒక డేటా లేక్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ సేవలను మరింత సరళతరం చేయడంలో ఈ సంస్థ దోహదపడుతోందని వివరిం చారు. డీప్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డ్రోన్స్ తదితర సాంకేతి సదుపాయలన్నీ ఉపయోగించుకోవడానికి ప్రత్యేక హబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రజలు ఒకే చోట అన్ని సేవలు సులభంగా పొందేలా ప్రభుత్వం ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్‌ను అందిస్తోందని చెప్పారు.

ఇందులో ప్రస్తుతం 161 సేవలు అందిస్తున్నామని, తదుపరి అన్ని రకాల సేవలు ఇందులోనే పౌరులు పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బోత్స వానా ప్రభుత్వ సలహాదారు బసిమా దబుతా మాట్లాడుతూ ఆర్టీజీఎస్ పనితీరు గురించి విని తాము ఈ కేంద్రాన్ని సందర్శించి స్వయంగా దీని పనితీరు

మిగతా.. 2లో



# దారుణాలకు కేరాఫ్ అడ్రస్ జగన్ రెడ్డి!

◆ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్

**మంగళగిరి, మహానాడు:** అసత్యాలే వైసీపీ అధినేత జగన్ అజెండా అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. విశ్వసనీయత, నీతి, నిజాయితీ అని జగన్ రెడ్డి విశ్వసనీయత గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు.జగన్ హయాంలో ఏనాడూ ప్రజాస్వామ్య బద్ధంగా పాలన

మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 08, ఫిబ్రవరి 2025 ‖

## ప్రపంచ బొగ్గు ఉత్పత్తిలో భారత్ రెండో స్థానం!

**మొదటి పేజీ తరువాయి..**

స్వర్ణజయంత్యుత్సవాలు జరుపుకొంటోంది. కోలిండియా ప్రపంచంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ. పవర్, స్టీల్, సిమెంట్, అల్యూమినియం, ఫెర్టిలైజర్, హెవీ ఇండస్ట్రీస్ రంగాల్లో బొగ్గు కీలకమైన అంశం.

భారతదేశంలో బొగ్గు ద్వారానే 74% విద్యుదుత్పత్తి జరుగుతోంది. రానున్న దశాబ్దాల్లోనూ బొగ్గు ఒక కీలకమైన ఇంధనంగా ప్రత్యేకతను సంతరించుకుంది. బొగ్గును నల్ల బంగారమని, కోకింగ్ కోల్ ను నల్లని వజ్రమని అంటారు. దేశంలో వివిధ రంగాలకు బొగ్గు అత్యంత కీలకమైన ఇంధనం. 2014లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. వివిధ రంగాల్లో సంస్కరణలు వచ్చాయి. అలాగే బొగ్గు రంగంలోనూ మౌలికమార్పులు, విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. పారదర్శకంగా కోల్ బ్లాక్స్ వేలం వేయడం, కమర్షియల్ కోల్ మైనింగ్, పాలసీ రిఫార్మ్, కోల్ గ్యాసిఫికేషన్, టెక్నాలజీ వంటి వినియోగం పెరిగింది.

దీని కారణంగా.. మన బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం పెరిగింది. నిర్ణయాలు తీసుకుని.. పారదర్శకంగా వాటిని అమలు చేయడం వల్లే ఉత్పత్తి పెరిగింది. 2023-24లో 998 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగింది. 2014లో ఇది కేవలం 609 కోట్ల బొగ్గు ఉత్పత్తి మాత్రమే జరిగేది.బొగ్గు రంగంలో ప్రైవేట్ రంగం భాగస్వామ్యం పెరిగిన తర్వాత మరింత పోటీ పెరిగింది. దీని ద్వారా చాలా సానుకూల మార్పులు వచ్చాయి. ఇప్పటివరకు 10 విడతల పాటు పారదర్శక వేలం పూర్తయింది. 184 బ్లాక్స్ వేలం జరిగింది. పదకొండో వేలం ఇటీవలే పూర్తయింది. త్వరలోనే 12వ వేలం జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. గనుల తవ్వకంలోని అడ్డంకులను తొలగించేందుకు అన్నిరకాలుగా పనిచేస్తున్నాం. పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖతో నిరంతరం సమన్వయంతో పనిచేస్తున్నాం. 2014లో విద్యుదుత్పత్తి సంస్థల వద్ద కేవలం 4 రోజుల బొగ్గు స్టాక్ మాత్రమే ఉండేది. కానీ మా సర్కారు తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా.. ఇవాళ 21 రోజుల స్టాక్స్ అందుబాటులో ఉన్నాయి. స్పాంజ్ ఐరన్, స్టీల్, ఫెర్టిలైజర్ వంటి నాన్ రెగ్యులేటెడ్ రంగాలకు కూడా బొగ్గును నిరంతరం సరఫరా చేస్తున్నాం. ఫస్ట్ మైల్ కనెక్టివిటీ ద్వారా.. బొగ్గు రవాణా విషయంలోనూ సంస్కరణలు తీసుకొచ్చాం.

బొగ్గు మంత్రిత్వ శాఖ సహాయంతో రైల్-సీ-రైల్ విధానంలోనూ బొగ్గు రవాణా వేగవంతం చేశాం. 2014తో పోలిస్తే రైల్వేల ద్వారా బొగ్గు రవాణా కూడా దాదాపు 50% పెరిగింది. విద్యుత్ రంగానికి బొగ్గు కేటాయింపులు విషయంలోనూ.. ఎలాంటి అడ్డంకులు రాకుండా సమగ్రమైన విధానంతో.. ముందుకెళ్లేందుకు 'శక్తి' పాలసీని తీసుకొచ్చాం. ప్రైవేటు రంగంలోనూ విద్యుదుత్పత్తి కేంద్రాలు, పీఎస్ యూలకు, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద విద్యుదుత్పత్తి కేంద్రాలున్నాయి. వీరెవ్వరికీ బొగ్గు కొరత లేకుండా పనిచేస్తున్నాం. విద్యుదుత్పత్తి కంపెనీలకు బొగ్గు రవాణా ధరలను తగ్గించేందుకు కోల్ రేషనలైజేషన్ పథకాన్ని తీసుకొచ్చాం. దీని వల్ల దాదాపు రూ.7వేల కోట్ల ఆదా జరిగింది. ప్రధానమంత్రి ఆలోచనలకు అనుగుణంగా.. బొగ్గు దిగుమతులు కూడా గణనీయంగా తగ్గుతున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు 8 నెలల్లో.. బొగ్గు దిగుమతులు చాలా తగ్గాయి.

దీని వల్ల దాదాపు 30వేల కోట్ల విదేశీ మారకం ఆదా అయింది. స్టీల్ రంగానికి అవసరమైన కోకింగ్ కోల్ విషయంలోనూ దాదాపు 1.7 శాతం దిగుమతులు తగ్గాయి. 'మిషన్ కోకింగ్ కోల్' లో భాగంగా.. ఈ విషయంపై ప్రత్యేక విధానంతో ముందుకెళ్తున్నాం. దేశీయంగా ఉత్పత్తిని పెంచడం ద్వారా దిగుమతులు తగ్గించేలా పనిచేస్తున్నాం. మన దేశంలో దొరికే కోకింగ్ కోల్ లో బూడిద శాతం ఎక్కువగా ఉంటుంది. అందుకే వాషరీలను అభివృద్ధి చేశాం. వీటితోపాటుగా కార్మికులు, ఉద్యోగుల భద్రతపైనా ప్రత్యేక విధానంతో పనిచేస్తున్నాం. మైనింగ్ సర్వే, టోపోగ్రఫీ అనాలసిస్ కోసం డ్రోన్స్ వినియోగం పెంచాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లర్నింగ్ ఆధారిత డ్రిల్స్, బ్లాస్ట్ ను డిజైన్ చేస్తున్నాం. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ బేస్డ్ ఫ్లీట్ మానిటరింగ్, ఫ్యుయల్ మానిటరింగ్ జరగుతోంది. సీఎంపీడీఐ (సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇనిస్టిట్యూట్) ద్వారా సీ-డీఏసీ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్) సహాయతతో.. పైలట్ ప్రాజెక్ట్ 5జీ నెట్ వర్క్ ఏర్పాటుచేసుకున్నాం.

దీంతోపాటుగా 5జీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ టెస్ట్ ల్యాబ్ కూడా తీసుకొస్తున్నాం. కోల్ మైన్స్ కీ యాక్టివిటీస్ ను 5జీ డ్రోన్ ఆధారిత రిమోట్ మానిటరింగ్ ద్వారా సర్వేలెన్స్ సిస్టమ్ ను ప్రారంభించాం. దీని ద్వారా.. నిరంతర నిఘా, సెక్యూరిటీ పెరిగింది. అక్రమ మైనింగ్ పై నిఘా పెరిగింది. కోల్ ప్రొడక్షన్ పెంచడం, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఉపయోగం, పర్యావరణ పరిరక్షణతోపాటుగా ఉద్యోగుల సంరక్షణ కూడా మా ప్రాధాన్యత. ఈ పదేళ్లలో మా మంత్రిత్వ శాఖ ద్వారా తీసుకొచ్చిన మార్పులు, నిఘా, మానిటరింగ్, భద్రతా ప్రమాణాలను నిక్కచ్చిగా అమలుచేయడం కారణంగా.. ప్రమాదాలు గణనీయంగా తగ్గాయి. 2013 తో పోలిస్తే. 2023 ప్రమాదకర ఘటను 50శాతానికి పైగా తగ్గాయి.

సీరియస్ యాక్సిడెంట్స్ కూడా దాదాపుగా 80% వరకు తగ్గాయి. దేశ ఇంధన భద్రత, సుస్థిరతను పెంచే దిశగా కోల్ గ్యాసిఫికేషన్ ఓ పెద్ద ముందడుగు. 2030 వరకు 100 మిలియన్ టన్నుల కోల్ గ్యాసిఫికేషన్ లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. దీని ద్వారా కార్బన్ ఎమిషన్ తగ్గడంతోపాటుగా.. క్లీనర్ కోల్ టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నాం. ఇందుకోసం రూ.8,500 కోట్ల ఆర్థిక ప్రోత్సాహక నిధికి కేబినెట్ కమిటీ ఆన్ ఎకనమిక్ అఫైర్స్ (ససీఈఏ) ఆమోదముద్ర వేసింది.

బొగ్గు మంత్రిత్వ శాఖ కు సంబంధించిన పీఎస్‌యూలు భిన్నమైన రంగాల్లోనూ ముందడగు వేస్తున్నాయి.

ఈ కంపెనీల ద్వారా పిట్ హెడ్ థర్మల్ పవర్ ప్లాంట్స్, సోలార్ పవర్ ప్లాంట్స్,ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్స్, క్రిటికల ఎక్స్ ప్లోరేషన్ వంటి వివిధ కార్యక్రమాలను కూడా పెద్దపీట వేస్తున్నాయి. నైవేలీ లిగ్నయిట్ కార్పొరేషన్.. భారతదేశంలోనే 1 గిగావాట్ రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తి చేసిన మొదటి పీఎస్‌యూ కా రికార్డు నెలకొల్పింది.

దేశంలో సోలార్ పవర్ ప్రొడక్షన్ చేసే పీఎస్‌యూల్లో నైవేలీ లిగ్నయిట్ కార్పొరేషన్ ముందువరసలో ఉంది. ఈ పీఎస్‌యూ ద్వారా.. 2030 వరకు 10 గిగావాట్లు, 2047 30 గిగావాట్ల రెన్యూవబుల్ ఎనర్జీ ప్రొడక్షన్ లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. కోలిండియా , మరో పీఎస్‌యూ కాబిల్ ద్వారా..విదేశాల్లో క్రిటికల్ మినలర్స్ బ్లాక్స్ ను చేజిక్కించుకుని వాటిలో తవ్వకాలు కూడా ప్రారంభమయ్యాయి.

బొగ్గు మంత్రిత్వ శాఖ పర్యావరణ పరిరక్షణ విషయంలోనూ ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్తున్నాం. 2024 జనవరి నుంచి నవంబర్ వరకు మా పీఎస్‌యూలు 2,372 హెక్టార్లలో 54 లక్షలకు పైగా మొక్కలు నాటారు. 2019-20 నుంచి 2024 వరకు.. 13,233 హెక్టార్లలో 2.9 కోట్ల మొక్కలు నాటాం. ప్రధానమంత్రి మోదీ 'ఏక్ పేడ్ మాకే నామ్'లో భాగంగా.. ఒక్క 25 జులై, 2024 నాడే.. 11 కోల్ మైనింగ్ యాక్టివిటీ ఉన్న రాష్ట్రాల్లో 332 ప్రాంతాల్లో 10 లక్షల మొక్కలు నాటాం దాదాపు 4,700 హెక్టార్ల డీ-కోల్డ్ అటవియేతర భూమును గుర్తించి అక్కడ పెద్దమొత్తంలో మొక్కలు నాటుతున్నాం.

ఇకో పార్క్, రిక్రియేషనల్ పార్క్, మైన్ టూరిజం వటి విషయాలకు మంత్రిత్వ శాఖ పెద్దపీట వేస్తోంది. గత ఐదేళ్లలోఇలాంటి 16 ప్రాంతాలను ఏర్పాటుచేసాం. ఇందులో ఏడు ప్రాంతాలను లోకల్ టూరిజం సైట్స్ తో అనుసంధానం చేశాం. గనుల్లోని నీటిని స్థానికంగా ఉండే ప్రజల అవసరాల కోసం ఇస్తున్నాం. 2024లో ఇలా 4,300 కిలో లీటర్ల ట్రీటెడ్ మైన్ వాటర్‌ను సమీప గ్రామాల్లో నీటిపారుదల, ఇంట్లో అవసరాల కోసం అందించాం. 2029 వరకు 500కు పైగా సంప్రదాయ జలవనరులను పునరుజ్జీవింప చేసే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించేందుకు 4 ఓవర్ బర్డెన్ ప్రాసెసింగ్ ప్లాంట్స్, ఐదు ఓవర్ బర్డెన్ టు మ్యానుఫాక్చర్డ్ శాండ్ లను ఏర్పాటుచేసి వినియోగంలోకి తీసుకొచ్చాం. బొగ్గు మంత్రిత్వ శాఖ పీఎస్‌యూ ల ద్వారా సామాజిక పురోగతి కోసం చాలా క్రియాశీలకంగా పనిచేస్తున్నాం. విద్య, వైద్యం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, తాగునీరు, మహిళాసాధికారత, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై విశేషంగా కృషిచేస్తున్నాం. 2024-25 లో రూ.772.72 కోట్ల CSR పనులు చేపట్టాం. ఇది అంతకుముందున్న ఏడాదితో పోలిస్తే సీఎస్ఆర్ వినియోగం 65% ఎక్కువగా ఉంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు సుస్థిర, బాధ్యతాయుతమైన మైనింగ్ కోసం 'మైన్ క్లోజర్ పోర్టల్'ను ప్రారంభించాం. దీని ద్వారా బొగ్గు వెలికితీత పూర్తయిన గనుల మూసివేత విషయంలో.. పారదర్శకత, సామర్థ్యం, జవాబుదారీతనం, పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నాం. దేశ చరిత్రలో తొలిసారిగా.. నిబంధనలకు అనుగుణంగా గనులను మూసివేసిన మూడు కంపెనీలకు 'ఫైనల్ మైన్ క్లోజర్ సర్టిఫికెట్స్' గత నెలలో అందించాం. ప్రస్తుతానికి 147 గనులు నిబంధనలకు అనుగుణంగా గనుల మూసివేత జరుగుతోంది. ఇలాంటి చాలా విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చాం. ఈ రంగంలో ఆత్మ నిర్భరత సాధించి వివిధ రంగాలకు సరైన రీతిలో బొగ్గును అందుబాటులో ఉంచేలా మరింత వ్యూహాత్మకంగా ముందుకెళ్తాం.



## అట్టహాసంగా ఆలపాటి నామినేషన్

- భారీగా తరలివచ్చిన కూటమి నేతలు, కార్యకర్తలు

**గుంటూరు,మహానాడు:** కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల కూటమి బలపరిచిన అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్.. శుక్రవారం గుంటూరులోని





వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వద్ద నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా కూటమి శ్రేణులు తరలి రాగ కలెక్టరేట్లో నామినేషన్ వేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, మంత్రి నాదెండ్ల మనోహర్, నెట్టం రఘురామ్, గల్లా మాధవి, నసీర్ అహ్మద్, తెనాలి శ్రవణ్, గద్దె రామ్మోహన్, కామినేని శ్రీనివాస్, ఏఎస్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## దారుణాలకు కేరాఫ్ అడ్రస్ జగన్ రెడ్డి!

**మొదటి పేజీ తరువాయి..**

నడిపించలేదని అధికారం కోల్పోయేసరికి విశ్వసనీయత, నీతి, నిజాయితీ అనే కొత్త మాటలు వస్తున్నాయన్నారు. ప్రజాతీర్పును అపహస్యం వేసే విధంగా అసెంబ్లీకి రాను.. మీడియా వేదికగా ప్రజా గొంతుకను వినిపిస్తానని అంటున్నారని, నిజమైన ప్రజానాయకుడు ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని అన్నారు. ప్రజా తీర్పును జగన్ రెడ్డికి గౌరవించటం రాదని విమర్శించారు. 2019లో టీడీపీకి 23 సీట్లే వచ్చినా ప్రజా తీర్పును గౌరవించి చంద్రబాబు అసెంబ్లీలో నడుచుకున్న తీరు గమనించాలన్నారు.

ప్రజానాయకుడు అంటే ప్రజలు ఏ విధంగా తీర్పు ఇచ్చినా ఆ తీర్పును గౌరవించే విధంగా నడుచుకోవాలి. అసెంబ్లీకి వెళ్లి ప్రజాగొంతుకను వినిపించాలి.. అలా కాదు, నాకు తక్కువ సీట్లు వచ్చాయి.. నేను అసెంబ్లీకి వెళ్లను.. మీడియా ముఖంగానే మాట్లాడుతాను అంటే ప్రజాతీర్పును అగౌరవపరడమేనని శ్రీనివాస్ అన్నారు. దారుణాలకు, దాడులకు, దోపిడీలకు జగన్ రెడ్డి కేరాఫ్ అడ్రస్ గా నిలిచారు. బాబాయ్‌ని హత్య చేసి చంద్రబాబుపై నెట్టిన తీరు.. ప్రతిపక్ష నాయకులపై దాడులు చేసిన తీరు.. మద్యం, ఇసుక, మైనింగ్‌లో దోపిడీలు చేసిన తీరు ఇందుకు నిదర్శనమన్నారు.

2019-2024 వరకు నాసిరక మద్యం విక్రయించి ఎంతో మంది ప్రాణాలను బలి తీసుకున్నారని, ఈనాటికి కూడా 3,00,000 మంది ఆ మద్యం తాగిన వాళ్ళు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, 35 వేల మంది మృతి చెందారన్నారు. పేరుకు మాత్రం 56 బీసీ కార్పొరేషన్లు పెట్టి బీసీలను అగౌరవపరిచే విధంగా సరైన కార్యాలయం గాని, కుర్చీలు గానీ ఇవ్వకుండా అవమానించారన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్‌ను 24 శాతానికి కుదించి 16 వేల మందిని పదవులకు దూరం చేశారని మండిపడ్డారు.

ఇప్పుడేమో నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ గొంతు చించుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. సూపర్ సిక్స్ అమలు కాలేదని జగన్ రెడ్డి అంటున్నాడు.. అమలు కాకుండానే అన్న క్యాంటీన్లు ప్రారంభించారా..? అమలు కాకుండానే పింఛన్ ను పెంచి వాలంటీర్లు లేకుండా ఇంటింటికి పంపిణీ చేస్తున్నారా అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల హామీల్లో పింఛన్ ను రూ.3000 చేస్తామని చెప్పిన జగన్ రెడ్డి.. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదికి రూ.250లు పెంచుకుంటూ పోతామని ప్రజలను మోసం చేశారన్నారు. ..

వైసీపీ ప్రభుత్వం.. కూటమి ప్రభుత్వం.. చేస్తున్నవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, అభివృద్ధి సంక్షేమం సమ ప్రాధాన్యతతో చంద్రబాబు పాలన సాగిస్తున్నారని, చంద్రబాబుపై నమ్మకంతోనే రాష్ట్రానికి పెట్టుబడులొస్తున్నాయని, నిజమైన విశ్వసనీయత, క్రెడిబిలిటీ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడేనని అన్నారు.

## ఆర్టీజీఎస్ పనితీరు అద్భుతం!

**మొదటి పేజీ తరువాయి..**

తెలుసుకోవాలని వచ్చామన్నారు. ఈ సంస్థ పనితీరు అద్భుతంగా, ఆదర్శనీయంగా ఉందని చెప్పారు. తమ దేశంలో కూడా పౌరులకు మెరుగైన సేవలందించేలా ఈ తరహా వ్యవస్థ ఏర్పాటు చేసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈవో మాధురి తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ 1 ఏపీయే లక్ష్యం!

**మొదటి పేజీ తరువాయి..**

ముందుకు వెళ్తుందని, వికసిత్ భారత్ 2047 సాధనలో ఏపీ మోడల్ స్టేట్‌గా ఉంటుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రానికి - రాష్ట్రానికి ఇది అనుకూల సమయమని, అభివృద్ధికి ఎంతో ఆస్కార ముందని... ఇందులో నీతి ఆయోగ్ భాగస్వామ్యం కూడా కచ్చితంగా ఉంటుందని సుమన్ బేరీ అన్నారు.

### 'సర్ణాంధ్ర-2047'పైనే ఫోకస్

ఆర్థిక వృద్ధి, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలు, సుస్థిరత... ప్రధానాంశాలుగా స్వర్ణాంధ్ర-2047పై ప్రధానంగా దృష్టిపెట్టామని ముఖ్యమంత్రి అన్నారు. మానవాభివృద్ధి-ఉత్తమ పాలన అంశాల్లో గ్లోబల్ లీడర్‌గా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని భావిస్తున్నామని చెప్పారు. అయితే, రాష్ట్రం కొన్ని సవాళ్లను ఎదుర్కొంటోందని... అందులో ముఖ్యంగా రాష్ట్ర విభజన వల్ల రెండు రాష్ట్రాల మధ్య తలెత్తిన ఆర్థిక వివాదాలు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడం, రాష్ట్ర ఆదాయానికి గ్రోత్ ఇంజిన్ వంటి హైదరాబాద్‌ను కోల్పోవడం, ఏపీ పూర్తిగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రం కావడం, గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు మూలధన వ్యయంపై నిర్లక్ష్యం చూపడం, మౌలికవసతులను కల్పించకపోవడం... వంటివి ఉన్నాయని చెప్పారు.

### సవాళ్లు ఎదురైనా సాధిస్తాం

పాలనలో పలు అడ్డంకులు తలెత్తినా రాష్ట్రానికి ఉన్న అనుకూలతలతో అన్ని విధాలా బలోపేతం చేసేందుకు శ్రమిస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఏపీ దేశంలో మూడో అతిపెద్ద తీర ప్రాంతం కలిగి ఉండటం, పోర్టులు-రైల్వే-హైవేలతో అతిపెద్ద కనెక్టవిటీ, 3 ఇండస్ట్రియల్ కారిడార్లు, తూర్పు-ఆగ్నేయాసియాకు గేట్ వే కావడం, పునరుత్పాదకత విద్యుత్, డేటా టెక్నాలజీలో పెట్టుబడులను ఆకర్షించడం ఏపీకి ప్రధాన సానుకూలాంశాలుగా తెలిపారు.

### రాష్ట్రంలో 3 గ్రోత్ హబ్‌లు

దేశంలోని 4 గ్రోత్ హబ్‌లో ఒకటిగా ఉన్న విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్)తో పాటు తిరుపతి - అమరావతిని రీజినల్ గ్రోత్ హబ్‌లుగా మలిచేందుకు నీతి ఆయోగ్ సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. బ్లూ ఎకానమీ, గ్రీన్ హైడ్రోజన్, ఏఐ డెవలప్మెంట్ గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించామని అన్నారు. డేటా సేకరణ, బెస్ట్ ప్రాక్టీసెస్, స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్స్, ప్రైవేట్ పెట్టుబడులను ఆకట్టుకోవడం, ఎఫ్‌డీఐ, రిసోర్స్ మొబిలైజేషన్ తదితర విషయాల్లోనూ నీతి ఆయోగ్ కీలకపాత్ర పోషించాలనే ఆకాంక్షను ముఖ్యమంత్రి



వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రతి మూడు నెలకు సమీక్ష చేయాలన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్లు, స్కిల్లింగ్ హబ్స్, స్మార్ట్ సిటీలు, మౌలిక వసతుల బలోపేతంలో ఏపీ ప్రభుత్వం - నీతి ఆయోగ్ కలిసి పనిచేయాలని ప్రతిపాదించారు. ఏపీ తీసుకున్న కీలక కార్యక్రమాలైన నదుల అనుసంధానం, పీ4 విధానం ద్వారా పేదరిక నిర్మాలన, 2047 విజన్‌లోని పది ప్రధాన సూత్రాల అమలుకు నీతి ఆయోగ్ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 3 సీ పోర్టులు, 3 ఎయిర్ పోర్టులు ఉన్న తిరుపతి-చెన్నయ్-నెల్లూరును ట్రై సిటీగా తీర్చిదిద్దితే ఆ ప్రాంతం అభివృద్ధిలో దూసుకువెళ్తుందని అన్నారు.

### కారు దగ్గరకు వెళ్లి మరీ వీడ్కోలు

హైదరాబాద్‌లో తాను అభివృద్ధి చేసిన జినోమ్ వ్యాలీలో ఇప్పుడు 700 కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తితో అత్యుత్తమ పాలసీలను ఏపీలో అమలు చేయాలనేది తమ విధానమని ముఖ్యమంత్రి చెప్పారు. 2029 కల్లా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సుల స్థానంలో 11 వేలకు పైగా ఈవీ బస్సులను ప్రవేశ పెట్టాలని భావిస్తున్నట్టు, అలాగే రాష్ట్రంలోని అన్ని బస్ స్టేషన్లపైనా రూఫ్ టాప్ సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నామని చెప్పారు. సచివాలయానికి తొలిసారి వచ్చిన సుమన్ బేరీకి ఘనంగా స్వాగతం పలకడమే కాకుండా సమావేశం అనంతరం ఆయన తిరిగి వెళ్లేటప్పుడు కారు దగ్గరకు వెళ్లి మరీ ముఖ్యమంత్రి వీడ్కోలు పలికారు.


## నిన్న మంగ్లీ.. నేడు నాగార్జున!

**మొదటి పేజీ తరువాయి..**

కారణమయింది.

పోనీ..రామ్మోహన్‌నాయుడు అనే నాయకుడు కొత్తగా రాజకీయాల్లోకి వచ్చారా? అసలు రాజకీయాలు తెలియని అమాయకుడా? లోకజ్ఞానం లేని నాయకుడంటే అదీ కాదు. వరసగా ఎంపీగా ఎన్నికవుతున్న నేత. సొంతంగా సోషల్‌మీడియా దళాలు నిర్వహించే తెలివైన యువనేత. మరి ఇన్ని తెలిసి.. ఇంత తెలివి ఉన్న రామ్మోహన్‌నాయుడు, వైసీపీని ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించే మంగ్లీకి తనతోపాటు వీఐపీ దర్శనం ఎలా చేయించారు? ఇవీ.. టీడీపీ సైనికులు ఉదయం నుంచి శరపరంపరగా సంధిస్తున్న ప్రశ్నాస్త్రాలు.

పోనీ.. తనపై మంగ్లీ కేంద్రంగా వస్తున్న విమర్శలకు స్పందించి, తన పొరపాటును క్షమించమని, రామ్మోహన్ ఏమైనా దిద్దుబాటుకు దిగారా అంటే అదీ లేదు. అంటే నాయకత్వం.. కొందరికి అతి స్వేచ్ఛ ఇచ్చి, నెత్తిన పెట్టుకోవడం వల్ల ఎలాంటి ఫలితాలు ఎదురవుతున్నాయో అర్థం అవుతోందని, అటు పార్టీ సీనియర్లు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు-లోకేష్‌తో ఉన్న సన్నిహిత సంబంధాలు, వారిచ్చిన స్వేచ్ఛను ఏ స్థాయిలో దుర్వినియోగం చేస్తున్నారో చెప్పేందుకు, రెండురోజుల వ్యవధిలో జరిగిన సంఘటనలు చాలన్న వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి.




ఇది జరిగిన మరుసటి రోజునే.. జగన్‌ను అమితంగా ప్రేమించే అక్కినేని నాగార్జున.. ఢిల్లీ పార్లమెంటు ఆవరణలోని టీడీపీ ఆఫీసులో ప్రత్యక్షం కావడాన్ని టీడీపీ అభిమానులు, ప్రధానంగా ఎన్టీఆర్ అభిమానులు అసలు జీర్ణించుకొలేకపోతున్నారు. ఎన్టీఆర్ ఫ్యామిలీని వ్యతిరేకించే అక్కినేని కుటుంబంతో, ఎన్టీఆర్ అభిమానులకు సైతం పొసగదన్న విషయం బహిరంగమే.

పైగా జగన్ మిత్రుడైన నాగార్జునను, ఏకంగా పార్టీ ఆఫీసులోకి ఎవరు తీసుకువ చ్చారు? అందుకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు గానీ, మంత్రి లోకేష్‌గానీ, చివరకు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అనుమతి తీసుకున్నారా? అని పార్టీ సైనికులు ప్రశ్నిస్తున్నారు.

అక్కినేని నాగేశ్వరరావుకు సంబంధించిన పుస్తకాన్ని మాజీ ఎంపి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రాశారు. హిందీలో రాసిన ఆ పుస్తకాన్ని ప్రధాని మోదీ ఆవిష్కరించారు. ఆ మేరకు ఉదయం 11 గంటలకు అపాయింట్ మెంట్ కూడా ఇచ్చారు. కానీ దానికంటే ముందు నాగార్జున.. సకుటుంబ సపరివార సమేతంగా, పార్లమెంటులోని టీడీపీ ఆఫీసులో ప్రత్యక్షమ య్యారు. ఆ ఫొటోలు వైరల్ కావడంతో, దానిపై టీడీపీ సోషల్‌మీడియా సోల్జర్స్ వెటకారంగా స్పందించారు.

" మరో ఆణిముత్యం.ఢిల్లీలోని టీడీపీ ఆఫీసులో ఎంపి శబరితో నాగార్జున ఫ్యామిలీ భేటీ".. నిన్న మంగ్లీ.. నేడు నాగార్జున..రేపు ఇంకెవరు వస్తారో? పార్టీని తిట్టిపోసి జగన్‌కు జై కొట్టిన వారికి రెడ్‌కార్పెట్ వేసే రోజులొస్తాయని కలలో కూడా ఊహించలేదు".. " ఇలా జరుగుతుందని ఊహించి ఉంటే, వైసీపీ వారి చేతుల్లో హత్యకు గురైన చంద్రయ్య అప్పుడే జై జగన్ అని ప్రాణాలు దక్కించుకునేవాడు. ఆ తెలివి ఆయనకు లేక పోవడం వల్లే మృత్యువాతపడ్డారు" అని విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు.

దానికంటే ముందు నాగార్జున ఢిల్లీ మేనేజర్, అక్కడికి చేరుకుని నాగార్జున పర్యటనను పర్యవేక్షించారట. ఆ తర్వాత మోదీ వద్దకు వెళ్లిన నాగార్జున.. మాజీ ఎంపి యార్లగడ్డ సమక్షంలో, ప్రధాని ఆ పుస్తకం ఆవిష్కరించారు. అందులో మోదీ పక్కన టీడీపీపీ నేత, నర్సరావుపేట ఎంపి లావు కృష్ణదేవరాయలు కూడా దర్శనమివ్వడమే టీడీపీ శ్రేణులను విస్మయపరిచింది.

సహజంగా బయట వ్యక్తులు టీడీపీపీ కార్యాలయానికి హాజరు కావాలంటే, పార్టీ ఫ్లోర్‌లీడర్ అనుమతి తప్పనిసరి. అంటే ఆ ప్రకారంగా లావు కృష్ణదేవ రాయలు అనుమతితోనే అక్కినేని కుటుంబం, పార్టీ ఆఫీసుకు వచ్చినట్లు స్పష్టమతుంది. పైగా ప్రధాని పక్కన నాగార్జున, యార్లగడ్డతో లావు కూడా ఉన్నారంటే.. యార్లగడ్డ టీడీపీపీ నేత లావును ప్రభావితం చేసి ఉండాలన్న వాదన, పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత లావు.. వారందరికీ తన నివాసంలోనే భోజనం ఏర్పాటుచేశారట.

అసలు యార్లగడ్డ.. అక్కినేనిపై రాసిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి టీడీపీ హడావిడి, ఆధ్వర్యం, ఆతిధ్యం ఏమిటి? గతంలో యార్లగడ్డ టీడీపీలో పనిచేసినప్పటికీ, ఆయన చంద్రబాబును వ్యతిరేకించే వ్యక్తి అని దగ్గుబాటి-నందమూరి హరికృష్ణ సలహాదారు అని.. అప్పట్లో బాబుపై హరికృష్ణ రాసిన లేఖల రచయిత, యార్లగడ్డ అన్నది పార్టీలో అందరికీ తెలిసిందే. జగన్ హయాంలో ఆయనకు పదవి కూడా కట్టబెట్టారు.

లక్ష్మీపార్వతి-యార్లగడ్డ ఇద్దరూ బాబుపై చేసిన జమిలి పోరాటం, కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. అలాంటి యార్లగడ్డ కార్యక్రమానికి టీడీపీపీనేత లావు ఎలా హాజరయ్యారు? వ్యక్తిగత హోదాలో వెళ్లారా? పార్టీ నేతగా వెళ్లారా? పార్లమెంటులో జరిగిన కార్యక్రమం కాబట్టి, వ్యక్తిగత హోదాలో వెళ్లడం కుదరదు. అందుకు ఆయన పార్టీ అనుమతి తీసుకున్నారా? లేదా? అన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. పైగా పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే బాలకృష్ణకు పద్మవిభూషణ్ అవార్డు వచ్చిన కొద్దిరోజులకే.. ఎన్టీఆర్ ఫ్యామిలీ అంటే సరిపడని అక్కినేని ఫ్యామిలీని, ప్రధాని వద్దకు తీసుకువెళ్లిన వైనం అటు బాలయ్య అభిమానులకూ రుచించడం లేదు.'అసలు అక్కినేనిపై పుస్తకం రాసింది యార్లగడ్డయితే, అక్కినేని ఫ్యామిలీని మోదీ వద్దకు తీసుకువెళ్లడం ఏమిటి? వాళ్లకు ప్రధాని వద్దకు తీసుకువెళ్లింది ఎవరు? పోనీ ఆ పుస్తక ముద్రణకు నాగార్జున ఆర్థిక సహాయం ఏమైనా చేశారా? ఎన్ కన్వెన్షన్ కూల్చివేత వ్యవహారం వివాదాస్పదమైన నేపథ్యంలో.. నాగార్జునను ప్రధాని వద్దకు తీసుకువెళ్లడం ద్వారా ఏం సంకేతాలిస్తున్నారు? ఈ వ్యవహారంలో ఎవరు ఎవరిని ప్రమోట్ చేస్తున్నారు? ఇదంతా నాగార్జునను బీజేపీకి దగ్గరచేసే వ్యూహాత్మక ప్రమోషన్ రాజకీయమా? ఈ 'మార్కెటింగ్ వ్యవహారం'లో టీడీపీని ఎందుకు లాగారు? అందులో మా పార్టీ ఎంపీ లావు ఎలా ఇన్వాల్వ్ అయ్యారో అర్థం కావడం లేదు"ని ఓ పొలిట్‌బ్యూరో సభ్యుడు వ్యాఖ్యానించారు.

ఏదేమైనా ఇలాంటి సంఘటనలు క్షేత్రస్థాయిలో.. ప్రత్యర్థిపార్టీతో యుద్ధం చేసే పార్టీ సైనికుల ఆత్మస్థైర్యం దెబ్బతీస్తాయన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నారు. కింది స్థాయిలో తాము ప్రత్యర్థి పార్టీ వారితో యుద్ధం చేసి, ప్రాణ-ఆస్తినష్టం చేసుకుంటే.. పైస్థాయిలో మాత్రం అంతా కలిసే ఉన్నట్లు కనిపించడం వల్ల, క్షేత్రస్థాయిలో పోరాటతత్వం చచ్చిపోతుందని సీనియర్లు స్పష్టం చేస్తున్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 08, ఫిబ్రవరి 2025



# ‘ఆపరేషన్ అరణ్య’ భేష్!

- ఎర్రచందనం సంరక్షణపై డిప్యూటీ సీఎం కీలక నిర్ణయాలు
- ‘ఎక్స్’ ద్వారా అటవీశాఖ ఉన్నతాధికారులకు అభినందనలు

**అమరావతి, మహానాడు:** ఎర్రచందనం స్మగ్లర్ల భరతం పట్టిన ‘ఆపరేషన్ అరణ్య’ విజయవంతం పట్ల ఆటవీశాఖ పనితీరుపై డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ ప్రశంసల వర్షం కురిపించారు. ఎర్రచందనం ఒక అరుదైన జాతి, దాని పరిరక్షణ చాలా ముఖ్యమని ఆయన తెలిపారు. ఎర్రచందనం సంరక్షణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఈ మేరకు సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో పవన్ కల్యాణ్ శుక్రవారం స్పందించారు. 195 ఎర్రచందనం దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో ఏపీ అటవీ శాఖ, రెడ్ శాండల్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషించారని అన్నారు. అక్రమ స్మగ్లింగ్ చేస్తున్న ఎనిమిది మంది నేరస్తులను పట్టుకున్న అధికారులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

ఈ ఆపరేషన్ అరణ్యతో ఎంతో విలువైన సహజ సంపదను అధికారులు రక్షించారని చెప్పారు. అధికారుల తిరుగులేని నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు.

ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడంలో మీ అంకిత భావం, వేగవంతమైన చర్యలు తీసుకున్న అధి కారులను ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వన్యప్రాణులు, అటవీ నేరాలను అరికట్టేందుకు చేస్తున్న అన్ని ప్రయత్నాలకు అండగా నిలుస్తోందని ప్రశంసించారు. ఈ విజయం భవిష్యత్ తరాల వారికి అడవులను సంరక్షించేలా చేస్తాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# లోకేష్ సారథ్యంలో ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం

- డ్రాపౌట్స్ నివారించండి
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్ల కేటాయింపు
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు, మహానాడు:** గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ప్రాథమిక విద్యా విధానం గందరగోళానికి గురైందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన 117 జీవో ఉపసంహరణపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఎమ్మెల్యే శుక్రవారం నెల్లూరులో విద్యాశాఖ అధికారులతో విద్యా ప్రగతి పై సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్త విధానంలో ఐదు రకాల పాఠశాలలను ప్రతిపాదనలపై చర్చించారు. గత ప్రభుత్వంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు వెనక్కి తీసుకొచ్చే విషయమై విద్యాశాఖ అధికారుల అభిప్రాయం కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6–8 తరగతుల విద్యార్థుల సంఖ్య 30, అంతకంటే తక్కువగా ఉంటే సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి, దాన్ని ప్రాథమిక పాఠశాలగా మార్చాలని ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు సూచించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త విధానంలో ఐదు రకాల పాఠశాలలు శాటిలైట్ ఫౌండేషనల్ స్కూల్, బేసిక్ ప్రైమరీ స్కూల్,



మోడల్ ప్రైమరీ స్కూల్ ల విధి విధానాల ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావుతో, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డితో పాటు కోవూరు, బుచ్చిరెడ్డి పాళెం, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరు పేటకు సంబంధించిన మండల విద్యా శాఖాధికారులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌ను 11% రిజర్వేషన్ అడగకుండా... ఓయూకు వీసీ, రూ. 50 లక్షలు అడిగిన మందకృష్ణ మాదిగ

- డాక్టర్ పిడమర్తి రవి ఆరోపణ

**హైదరాబాద్, మహానాడు:** వర్గీకరణ చేయమని, మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అడగకుండా ఓయూకు వీసీ, ఎమ్మార్పీఎస్ కార్యకర్తల కోసం రూ. 50 లక్షలు కావాలని మందకృష్ణ మాదిగ అడిగాడని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆరోపించారు. ఈ మేరకు రవి శుక్రవారం వివేకానంద నగర్ కాలనీ కూకట్ పల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వర్గీకరణ ఆమోదం తెలిపినందుకు ధన్యవాదాలు తెలుపుతూ మాదిగ యూత్ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు చిరుమర్తి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిగ జేఏసీ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మందకృష్ణ మాదిగ కు దామోదర రాజనర్సింహ 30 లక్షల రూపాయలు ఇచ్చారని 20 లక్షలు ఇవ్వనందుకే దామోదర రాజనర్సింహని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నాక ఇప్పుడు బిజెపి కోసం 11% అడుగుతున్నాడన్నారు. 11% ఉద్యమం కేవలం పత్రిక ప్రకటనలకు మాత్రమే అంకితం అని ఆ తర్వాత బిజెపి పార్టీ బలోపేతం కోసం రాజ్యసభ పదవి కోసం మాత్రమే పని చేస్తారని మాదిగల కోసం పనిచేయడం కృష్ణ మాదిగకు అలవాటు లేదని అన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు వస్తేనే విజయోత్సవ ర్యాలీ చేసుకున్న ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ అమలు పరుస్తూ అసెంబ్లీలో ప్రకటన చేసిన గాని ఎందుకు సంబరాలు చేసుకోవడం లేదో అర్థం కాని పరిస్థితి అని అన్నారు. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును భారత దేశంలో మొట్టమొదటిసారి ఇంప్లిమెంట్ చేసిన రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఉందని ఆ ఘనత సాధించిన మాదిగ పక్షపాతి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు.

ఈ సందర్భంగా చిరుమర్తి రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో విద్యార్థి జేఏసీ చైర్మన్ గా ఉన్న డాక్టర్ పిడమర్తి రవి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని విజయతీరాలకు తీసుకువెళ్ళారని, అదే



ఉద్యమస్ఫూర్తితో రాష్ట్రంలో మూడు దశాబ్దాలకు పైన ఉద్యమిస్తున్న మాదిగలకు పదేళ్ళుగా మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కావాలి... జిల్లాల వారీగా వర్గీకరణ చేయాలి... తెలంగాణ రాష్ట్రంలో అనే నినాదంతో ముందుకు నడుస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి పిడమర్తి రవి అని తెలిపారు.

విమర్శ రవన్నకి మాదిగల తరఫున ఉద్యమాభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ బొమ్మెర స్టాలిన్, బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, రింగు రాంబాబు, మాడుగుల శివ, విక్రమ్ జోగు. గణేష్ మీసాల. మహేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి మీ మాటలు కోటలు దాటితే, ఆచరణ గడప దాటదు

- గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనల పట్ల మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం

**హైదరాబాద్:** మహబూబాబాద్ జిల్లా దామరవంచ గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్ జరిగి, విద్యార్థులు ఆసుపత్రి పాలు కావడం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట. ఏడాది కాంగ్రెస్ పాలనలో ఒకటి కాదు రెండు కాదు గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు వందల్లో జరిగాయి. వందల మంది విద్యార్థులు ఆసుపత్రి పాలు కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. కల్తీ ఆహారం విద్యార్థులకు పెడితే అరెస్టులు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా గురుకులాల తీరు ఉంది. రేవంత్ రెడ్డి మీ మాటలు కోటలు దాటితే, ఆచరణ గడప దాటదు అనేందుకు గురుకులాల దీన స్థితే నిదర్శనం. ఆసుపత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ఫుడ్ పాయిజన్ కేసులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.







# సోనుసూద్‌కు అరెస్టు వారెంట్!

**లుథియానా:** ప్రముఖ నటుడు సోనుసూద్‌కు అరెస్టు వారెంట్‌ను లుథియానా కోర్టు జారీ చేసింది. ఓ మోసం కేసులో వాంగ్మూలం ఇవ్వడానికి రాకపోవడంతో శుక్రవారం అరెస్టు వారెంట్ ఇచ్చింది. లుథియానాకు చెందిన న్యాయవాది రాజేష్ ఖాన్నా తనకు మోహిత్ శర్మ అనే వ్యక్తి రూ. 10 లక్షలు మోసం చేశాడని కోర్టులో కేసు వేశారు. ఈ కేసులో సోనుసూద్‌ను సాక్షిగా పేర్కొన్నారు. అయితే, ఎన్నిసార్లు సమన్లు పంపినా అతను కోర్టుకు హాజరు అవ్వకపోవడంతో, కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది.

# ప్రజావాణికి 4,901 దరఖాస్తులు

- స్వీకరించిన చిన్నారెడ్డి

**హైదరాబాద్, మహానాడు:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 4,901 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 157, విద్యుత్ శాఖకు సంబంధించి 105, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 30, ఇందిరమ్మ ఇండ్ల కోసం 2,865



దరఖాస్తులు వచ్చాయి. పౌర సరఫరాల శాఖ కు సంబంధించి 1640 (రేషన్ కార్డులు) దరఖాస్తులు వచ్చాయి, ఇతర శాఖలకు సంబంధించి 109 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్.జీ. చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

**అమరావతి, మహానాడు:** నీతి ఆయోగ్ వైస్‌చైర్మన్ సుమన్ బేరి నేతృత్వంలోని బృందం శుక్రవారం సచివాలయానికి చేరుకుంది. బృందానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఘన స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావులతో నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ భేటీ అయింది.



# సచివాలయాల ఉద్యోగులపై ఏకపక్ష నిర్ణయం తగదు

- ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి

**తాడేపల్లి, మహానాడు:** ప్రజల ముంగిట ప్రభుత్వ సేవలు లక్ష్యంగా వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైయస్ జగన్ తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ సలహాదారు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి ఆక్షేపించారు. సచివాలయాల ఉద్యోగులపై ఏకపక్ష నిర్ణయం తగదన్న ఆయన, రేషనలైజేషన్‌పై పునరాలోచన చేయాలని కోరారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో చర్చించాకే నిర్ణయం తీసుకోవాలని, ఉద్యోగ సంఘాల అభిప్రాయాలూ పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మరోవైపు ఉద్యోగులకు ప్రభుత్వ బకాయిలు రూ. 30 వేల కోట్లకు చేరాయన్న చంద్రశేఖర్‌రెడ్డి, వెంటనే ఆ మొత్తం చెల్లించాలని కోరారు. 9 నెలలైనా ఉద్యోగులకిచ్చిన ఏ హామీ నెరవేర్చలేదన్న ఆయన, ఆ హామీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వైయస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారని, ఎలాంటి అవినీతికి తావు లేకుండా అతి స్వల్ప కాలంలో 1.35 లక్షల మందిని సచివాలయాల ఉద్యోగాల్లో నియమించారని ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 15,004 సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలన్నీ సులువుగా, వేగంగా అందేలా చేశారన్న ఆయన, ఈ వ్యవస్థను అనేక రాష్ట్రాలు పరిశీలించాయని గుర్తు చేశారు. ఆ అక్కసుతోనే



ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఆక్షేపించారు. సేవలు కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ. 10 వేలకు పెంచుతామని, 2.60 లక్షల మంది వాలంటీర్లను నమ్మించి మోసం చేసినట్లుగా, సచివాల యాల ఉద్యోగులపైనా అదే కుట్ర చేస్తున్నట్లు అనిపిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు.

# రాష్ట్ర అభివృద్ధే కూటమి ధ్యేయం!

- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

**దర్శి, మహానాడు:** ఏపీ ప్రజలకు మరో తీపి కబురుగా క్యాబినెట్‌లో కూటమి సర్కారు అనేక కీలక నిర్ణయాలు ప్రకటించిందని దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం 21 అంశాలను ఏపీ క్యాబినెట్ ఆమోదించడం శుభ పరిణామం అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి తల్లికి వందనం పథకాన్ని అమలు చేసే దిశగా, డీఎస్సీ పోస్టులను భర్తీ చేయాలని, అన్నదాత సుఖీభవ పథకం అమలుపై ఉన్న అడ్డంకులను తొలగించాలని, నకిలీ రిజిస్ట్రేషన్ కు అరికట్టేలా రెవిన్యూ శాఖలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు చట్టాన్ని రూపొందించాలని నిర్ణయించారని వివరించారు.



### బాధాపురం మంచినీటి సమస్య తీర్చండి

దొనకొండ మండలం, బాధాపురం గ్రామం పడుతున్న మంచినీటి ఇబ్బందులపై గొట్టిపాటి లక్ష్మి తీవ్రంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. పైపులైన్‌ల లీకేజీల వల్ల కొద్ది రోజులుగా బాధాపురం గ్రామానికి మంచినీటి కష్టాలు ఎదురవుతున్నట్టు తెలుసుకుని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామ్మోహన్‌తో, ఏఈ కిరణ్‌తో మాట్లాడారు. అక్కడ ఉన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని, రెండు రోజుల్లో ఆ గ్రామాన్ని సందర్శిస్తానని చెప్పారు.



# వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌పై ప్రచారం అవసరం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి

**భీమవరం, మహానాడు:** వన్ నేషన్... వన్ ఎలక్షన్ అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. భీమవరం లో పార్టీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటు కూరి సూర్య నారాయణరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, సుహాసిని ఆనంద్ లతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం జరిగింది. వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ వర్గాల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలకు పార్టీ వైపు నుండి అండగా ఉండాలన్నారు. ప్రజలను ఈ విషయంపై సమాయత్తం చేయాల్సిన ఆవశ్యకతపై పురంధేశ్వరి పలు అంశాలను ప్రస్తావించారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

- మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి

**పాకాల, మహానాడు:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు నెలల్లో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి వివరించారు. చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలంలోని గాదంకి పంచాయతీ మహిళలతో ముఖాముఖి కార్యక్రమం శుక్రవారం జరిగింది. అనంతరం గాదంకి పంచాయతీలోని సమస్యలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. యుద్ధ ప్రాతిపదికన పరిష్కారమయ్యే సమస్యలను ఎమ్మెల్యే పులివర్తి నాని, అధికారులు దృష్టికి తీసుకెళ్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 08, ఫిబ్రవరి 2025 ||



## పెన్షనర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి

- పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హెూదా రాకపోవడం సీఎం చేతగానితనం కాదా?
- బీఆర్ఎస్ నేత జి .దేవీప్రసాద్

హైదరాబాద్: పెన్షనర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చింది. పదవీ విరమణ అంటే ఉద్యోగులు భయపడుతున్నారు. ఉద్యోగులు మానసిక ఆందోళనకు గురి అవుతున్నారు. జనవరి 25 వరకు 8,764 మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వారికి ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి రూపాయి రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్డ్ అయిన ఉద్యోగులను భయాందోళనకు గురి చేస్తుంది.

గత మార్చి నుండి ఇప్పటి వరకు రిటైర్డ్ అయిన ఉద్యోగులకు బెనిఫిట్స్ రాలేదు. పెన్షనర్లు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.రిటైర్డ్ అయిన ఉద్యోగులు సెక్రటేరియట్ చుట్టూ తిరుగుతున్నారు. కొంత మంది ఉద్యోగులు హైకోర్టులో కేసు వేశారు.

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రిటైర్డ్ అయిన ఉద్యోగులను అదే రోజు వారికి బెనిఫిట్స్ ఇచ్చారు. కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు రావడం లేదు. అంగన్ వాడీ,ఆశా వర్కర్ల జీతాలు పెంచు తామని చెప్పి మాట తప్పారు. 14 నెలలు అయినా ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వలేదు. 35 సార్లు సీఎం రేవంత్రెడ్డికి ఢిల్లీ వెళ్లి వచ్చారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు నిధులు తేలేకపోయారు. కులగణన,ఎస్సీ వర్గీకరణపై ఎవరూ సంతృప్తిగా లేరు. కులగణన సర్వేను చింపివేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అంటున్నారు. రాష్ట్రంలో 7వ గ్యారెంటీగా నిర్బంధం కొనసాగుతోంది.

పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హెూదా రాకపోవడం సీఎం చేతగానితనం కాదా? సీఎం రేవంత్ రెడ్డి స్వంత పార్టీని ఒప్పించి మంత్రివర్గ విస్తరణ చేయలేని పరిస్థితిలో ఉన్నారు.

## దమ్ము లేకే వైసీపీ పోటీలో లేదు

- కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్ విమర్శ



గుంటూరు, మహానాడు: గుంటూరు కృష్ణా జిల్లాల పట్టభద్రుల అభ్యర్థిగా నన్ను కూటమి ఎంపిక చేయడం చూస్తే రాజకీయ రుణం తీర్చుకొనేందుకు మరో అవకాశం కల్పించారని కూటమి నేతలను ఆలపాటి రాజేంద్రప్రసాద్ కొనియాడారు. 33 నియోజకవర్గాల పరిధిలోని పట్టభద్రుల సమస్యలపై పోరాటం చేయడానికి కూటమి అవకాశం కల్పించిందని ఆయన అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆయన శుక్రవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా కూటమి నేతలు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. నా నామినేషన్ కార్యక్రమానికి వచ్చిన మీరందరిని చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. కూటమి పట్టభద్రుల ఎమ్మెల్సీ గా నా విజయానికి పనిచేస్తున్న మిమ్మల్ని చూస్తుంటే పనిచేసే వారికి అవకాశం కల్పిస్తారన్న విషయం అర్థమవుతోందన్నారు.

ఉద్యోగ సంఘాలు, నిరుద్యోగ యువత, పట్టభద్రుల సమస్యలు పరిష్కరించటానికి అందరితో కలిసి పనిచేస్తానని హామీ ఇస్తున్నా... ప్రజల తరపున సేవచేయడానికి కూటమి నేతలు మాత్రం నాకు మరో సదవకాశం కల్పించారు.. సమస్యల పట్ల అవగాహన ఉంది కాబట్టే కూటమి ప్రభుత్వం నాకు ఇలాంటి అవకాశం కల్పించింది. రాష్ట్రంలో ప్రజలే కూటమి ప్రభుత్వ నికి గత ఎన్నికల్లో విజయాన్ని ఇచ్చారు. ఎన్నికలు వస్తే తోకముడిచి పారిపోయే పార్టీ వైసీపీ, వాళ్లకు పోటీ చేయాలనే ధైర్యం లేకనే పక్కకు తప్పుకున్నారు... ప్రజలంటే భయం, ప్రజా సమస్యలంటే పట్టవు, దోపిడీ విధానంపై దృష్టి పెట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు... అలాంటి వైసీపీ గురించి మాట్లాడటం అనవసరం, ఇలాంటి సమయంలో వారి కోసం మాట్లాడకూడదు అని రాజేంద్రప్రసాద్ వ్యాఖ్యానించారు.





## నకిలీ డాక్యుమెంట్లతో జోగి రమేష్ అనుచరుల మోసం!

- గ్రీవెన్స్‌లో బాధిత మహిళ ఫిర్యాదు
- టీడీపీకి జయ్ కొట్టామని పింఛన్ నిలుపుదల
- అర్జీలు స్వీకరించి, పరిష్కారానికి కృషి చేసిన నేతలు

మంగళగిరి, మహానాడు: నకిలీ డాక్యుమెంట్లతో జోగి రమేష్ అనుచరులు ముక్కంటి నారాయణ, బత్తుల వెంకటయ్య, పవన్‌లు తనకు స్థలాన్ని అమ్మి తన వద్ద డబ్బులు కొట్టేశారని.. వీరిపై చర్యలు తీసుకొని తనకు రావాల్సిన డబ్బులు తిరిగి ఇప్పించాలని ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన బండారు పద్మ శుక్రవారం ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో విజ్ఞప్తి చేశారు. వివిధ రకాల వినతులు, ఫిర్యాదులను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి గుమ్మడి సంధ్యారాణి, శాసన మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధలు స్వీకరించి, కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కారానికి కృషి చేశారు.

- నంద్యాల జిల్లా, బేతం చెర్లకు చెందిన డి.వెంకటస్వామి, రామస్వామిలు అర్జీ ఇస్తూ.. తమకు గత టీడీపీ ప్రభుత్వంలో వచ్చే పింఛన్ ను వైసీపీ ప్రభుత్వం వచ్చాక అన్యాయంగా తొలగించారని.. తాము టీడీపీ సానుకూలపరులమని వైసీపీ నేతలు కావాలని తమ పింఛన్ ను తొలగించి వికలాంగుడు, వృద్ధులైన తమను తీవ్రంగా ఇబ్బందిపెట్టారని బోరుమన్నారు. తొలగించిన తమ పింఛన్ ను పునరుద్ధరించి తమను ఆదుకోవాలని వారు నేతలకు అర్జీ ఇచ్చారు.



- విజయనగరం జిల్లా, దత్తిరాజేరు మండలం చినకాడ గ్రామానికి చెందిన కిల్లాడ రాములమ్మ విజ్ఞప్తి చేస్తూ.. కబ్జాదారుల ఆక్రమణలో ఉన్న తమ భూమిని సర్వే చేసి హద్దులు చూపించాలని అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని.. దయ చేసి తమ భూమిని సర్వే చేసి హద్దులు చూపించాలని వేడుకున్నారు.
- ప్రకాశం జిల్లా, పుల్లల చెరువు మండలం సింగపల్లి గ్రామంలో తాను కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేయమంటే అధికారులు తిప్పుకుంటున్నారని.. తమ భూమి రిజిస్ట్రేషన్ చేసేందుకు ఉన్న సమస్యను తొలగించి అధికారులు రిజిస్ట్రేషన్ చేసేలా చూడాలని పశ్చిమ గోదావరి జిల్లా, పసివెదల గ్రామానికి చెందిన బిక్కిన సీతారామయ్య విన్నవించుకున్నాడు.
- కృష్ణా జిల్లా, గుడివాడకు చెందిన కోనా పుణ్యకుమారి నేతలకు విజ్ఞప్తి చేస్తూ.. తన స్థలానికి దొంగ పట్టాలు పుట్టించి మంచు ఫణీంద్ర అనే ప్రభుత్వ ఉద్యోగి, మచ్చు వెంకటేశ్వరరావు పేరుతో లోన్లు తీసుకొన్నారని ఈ విషయం తెలిసి నిలదీస్తే.. ఒంటరి మహిళనైన తనపై దౌర్జన్యానికి వస్తున్నారని.. ఈ మోసానికి పాల్పడిన వీరిపై తగిన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఆమె అభ్యర్థించింది.
- గుంటూరు జిల్లా, తెనాలి మండలం బర్రిపాలెం గ్రామానికి చెందిన రైతులు విజ్ఞప్తి చేస్తూ.. సర్వే నెంబర్ 244/1 లో ఉన్న డొంక దారిని కబ్జా చేసి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని.. దాంతో రైతుల పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా ఇబ్బందిగా మారుతుందని.. దయ చేసి అధికారులు సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని వారు గ్రీవెన్స్‌లో నేతలకు అర్జీ ఇచ్చి ప్రాధేయ పడ్డారు.



- శ్రీకాకుళం జిల్లా, సంతబొమ్మాలికి చెందిన చల్లా జగ్గారావు విజ్ఞప్తి చేస్తూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా దాదాపు 1000 మంది పనిచేస్తున్నామని.. తమకు గత ప్రభుత్వం జీతాలను నిలిపి ఇబ్బంది పెట్టిందని.. దయ చేసి తమకు రావాల్సిన జీతాలు ఇప్పించి ఆదుకోవాలని గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి వేడుకున్నారు.
- గుంటూరు జిల్లా, పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన వల్లపు భాగ్యవతి విజ్ఞప్తి చేస్తూ.. ప్రభుత్వం ఫీజు రీ యింబర్స్‌మెంట్ ఇస్తుందన్న నమ్మకంతో తాను ఎం.ఫార్మసీ చేరి పూర్తి చేశానని కాని తనకు గత ప్రభుత్వం ఫీజు రీ యింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో తనకు ఫీజు కట్టుకోలేని పరిస్థితి వచ్చిందని దయ చేసి ప్రభుత్వమే తనను ఆదుకోవాలని ఆమె గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేసింది.
- అదే జిల్లా, అచ్చంపెట మండలం నిండుజర్ల గ్రామానికి చెందిన పిల్లగొర్ల నాగరత్నం విజ్ఞప్తి చేస్తూ.. తనకు ప్రభుత్వం మంజూరు చేసిన డి పట్టా భూమిని తోకల నీలకంటేశ్వరరావు, నీలయ్యలు ఆక్రమించుకున్నారని.. వారి నుండి తన భూమిని విడిపించాలని ఆమె టీడీపీ రాష్ట్ర అధ్యక్షులకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- ఆంధ్రప్రదేశ్ వెటర్నీస్టూడెంట్స్ అండ్ గ్రాడ్యూయేట్ అసోసియేషన్ కు సంబంధించిన పలువురు విద్యార్థులు గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇస్తూ.. జనరల్ వైద్య విద్యార్థులకు రూ. 25,000 స్టై ఫండ్ ఇస్తూ.. తమకు మాత్రం రూ. 7,000 వేలతో సరిపెడుతున్నారని.. దయ చేసి తమకు కూడా ప్రభుత్వం రూ. 25,000 వేలు స్టైఫండ్ ఇవ్వాలని వారు అభ్యర్థించారు.

## బొంకుల బాసు జగన్!

- అసెంబ్లీకి వెళ్యారా అని అడిగితే స్పీకర్‌కు అడగమన్న మాజీ సీఎం
- శవాలు ఉంటేనే బయటకొచ్చే పులివెందుల ఎమ్మెల్యే
- విలేఖర్ల సమావేశంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఎద్దేవా




మంగళగిరి, మహానాడు: అబద్ధాల్లో ఆస్కార్ అవార్డు ఇవ్వాల్సిన వ్యక్తి జగన్ అని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి వ్యాఖ్యానించారు. ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్ రెడ్డి అయిదేళ్ళ కాలంలో పార్టీలో ఎవరినీ కలవలేదని ఎవరితో మాట్లాడలేదని తానే ఒప్పుకుంటున్నారని, దోచుకోవడం, దాచుకోవడం అంటే ఏంటో చూపించడానికే జగన్ 2.0 అవతారం ఎత్తబోతున్నారని ఆమె ఎద్దేవా చేశారు.

పరిపాలనాదక్షుడైన చంద్రబాబుపై విమర్శలు చేయడం జగన్ పిచ్చికి పరాకాష్ఠ అని దుయ్యబట్టారు. జగన్ దోచుకున్న సొమ్ము చంద్రబాబు దోచుకున్నట్టు, అతను చేసిన అప్పులు కూటమి ప్రభుత్వం చేసినట్టు జగన్ రెడ్డి చెబుతున్నారని, ఈ అప్పుల్లో 20,000 కోట్లు ఏప్రిల్, మే నెలల్లో జగన్ రెడ్డి ప్రభుత్వం చేసినవేనని సంధ్యారాణి తెలిపారు. ఎన్నికల కోడ్ సమయంలో తెచ్చిన అప్పులతో రాష్ట్రానికి ఏం చేశారని ప్రశ్నించారు. జగన్ రెడ్డిలాగా చంద్రబాబు రుషికొండ ప్యాలెస్ లు కట్టుకోలేదు, ఇంటి చుట్టూ కోట్లు పెట్టి ఇనుప కంచెలు నిర్మించుకోలేదని దుమ్మెత్తిపోశారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని 20 ఏళ్ళు వెనక్కి నెట్టి, ఎనిమిది లక్షల కోట్ల రాష్ట్ర సంపద దోచుకున్నారని ఆరోపించారు. ఐదేళ్లలో విపత్తు నిధులు, పోలవరం, గ్రామ పంచాయతీలు సహా కేంద్రం ఇచ్చిన నిధులన్నీ దారి వైసీపీ నేతలు దారి మళ్లించారని, డ్వాక్రా మహిళలు పొదుపు సొమ్ము 2,100 కోట్ల సైతం మింగేసిన తిమింగలాలని ఆమె విమర్శించారు.

ఐదేళ్లపాటు వేలాది మంది మహిళలపై అరాచకం చేసినా ఒక్కరిపై జగన్ చర్యలు తీసుకోలేదని సొంత తల్లికి, చెల్లికి అన్యాయం చేసిన జగన్ రెడ్డి... ఈ రోజు నీతులు చెప్పడం విడ్డూరమన్నారు. ఐదేళ్లు తన నాయకులతో బూతులు మాట్లాడించిన సిగ్గులేని బుద్ధిమంతుడు జగన్ రెడ్డి అని ఆమె విమర్శించారు. వైసీపీ నేతల్లా అసహ్యంగా, అవమానకరంగా తాం మాట్లాడలేమని, చంద్రబాబు నాయుడు పార్టీ నాయకులకు క్రమశిక్షణ నేర్పించారని, నీతి, నిజాయితీ, క్రమశిక్షణ తెలుగుదేశం కార్యకర్తల సొంతమన్నారు.

అసెంబ్లీ కి రావడంపై విలేఖరి అడిగిన ప్రశ్నకు స్పీకర్ ని అడగమంటున్నారని, 11 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై సభలో చర్చించకపోతే రాజీనామా చేయాలని సంధ్యారాణి డిమాండ్ చేశారు. జగన్ బయటికి రావాలంటే శవం కావాలి. శవాలతోనే రాజకీయం చేస్తారని, ఐదేళ్లలో రాష్ట్రంలో అరాచకాలు, నేరాలు, ఘోరాలు చెప్పనలవికానివని, చంపేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీని జగన్ పక్కన పెట్టుకుని తిరుగుతారన్నారు.

జగన్ రెడ్డి పాలనలో సర్పంచులకు, స్థానిక సంస్థలకు అధికారం లేక పనులు సాగని పరిస్థితి ఏర్పడిందని, ఎమ్మెల్యేలు, మంత్రులకు కూడా జగన్ రెడ్డి మొహం చూపించలేదన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ. 4 వేల పెన్షన్ చంద్రబాబు పంపిణీ చేయిస్తున్నారని, ఏడు నెలల కాలంలో కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఈ ఏడు నెలల్లో ప్రజలెవరైనా ఇబ్బందులున్నాయని జగన్‌కి చెప్పారా అని ప్రశ్నించారు.

ధాన్యం కొనుగోలుపై ధర్నాకి పిలుపునిస్తే ప్రజలెవరైనా వచ్చారా, ఎందుకంటే ధాన్యం కొన్న సొమ్మును 24 గంటల్లోనే రైతులకు జమ అయ్యాయి, రైతులకు ఇబ్బందులు లేవు కాబట్టే... విద్యార్థులకు ఫీజు బకాయిలు పెట్టింది మీరే, ధర్నాకి పిలుపు నిచ్చేది మీరే అని దుయ్యబట్టారు. మీరు పెట్టిన బకాయిలు తీర్చడానికే సగం సొమ్ము ఖర్చవుతోందన్నారు. జగన్ హయాంలో రోడ్ల అనుసంధానం లేక గిరిజన ప్రాంతాలలో గర్భిణులు అష్ట కష్టాలు పడ్డారని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక 350 కోట్లతో గిరిజన గ్రామాలలో రహదారి సౌకర్యం కల్పించారన్నారు.

గిరిజనులను జగన్ రెడ్డి చిన్న చూపు చూసి వసతి గృహాలను నిర్వీర్యం చేస్తే కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో వసతి గృహాలు పునరుద్ధరించి అనేక సేవలందిస్తోందని సంధ్యారాణి తెలిపారు. ఐటీడీఏలను, ట్రైకార్ రుణాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిందని, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్‌తో పాటు అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. జగన్ రెడ్డి దొంగ మాటలు, కట్టు కథలు మానుకోకపోతే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

బాబాయ్ హత్యని గుండెపోటుగా చిత్రీకరించిన జగన్ విశ్వసనీయత గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్షల కోసం పని చేయడం నిజమైన విశ్వసనీయత అని, కష్టపడి పని చేయడానికి, నిజాయితీకి, విశ్వసనీయతకు అద్దం పట్టే వ్యక్తి చంద్రబాబు అని ఆమె పేర్కొన్నారు. జగన్ కి విశ్వసనీయత లేదు కాబట్టే అయన పార్టీ లో ఎవరూ ఇమడలేక బయటికొస్తున్నారని అన్నారు.



## తెలుగు చిత్రసీమ అభివృద్ధిలో ఏఎన్ఆర్‌ది కీలకపాత్ర!

- అక్కినేనికి ప్రధాని మోదీ ఘన నివాళి
- యార్లగడ్డ విరచిత "మహాన్ అభినేత అక్కినేని క విరాట్ వ్యక్తిత్వం" పుస్తకాన్ని పీఎంకు బహూకరించిన నాగార్జున

న్యూఢిల్లీ, మహానాడు: ప్రముఖ తెలుగు నటుడు, దాత అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్ఆర్) భారతీయ చిత్రసీమకు చేసిన అపారమైన సేవలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఘనంగా స్మరించుకున్నారు. పార్లమెంట్ హౌస్‌లో జరిగిన సమావేశంలో, ప్రఖ్యాత నటుడు అక్కినేని నాగార్జున ప్రధాని మోదీకి "మహాన్ అభినేత అక్కినేని క విరాట్ వ్యక్తిత్వం" అనే పుస్తకాన్ని అందజేశారు. ఏఎన్ఆర్ 100వ జయంతిని పురస్కరించుకుని ఈ పుస్తకాన్ని పద్మభూషణ్ అవార్డు గ్రహీత, మాజీ ఎంపీ ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ రచించారు. ఈ పుస్తకం ఏఎన్ఆర్ సినీ ప్రస్థానం, సమాజానికి అందించిన సేవలు, ఆయన ప్రభావాన్ని వివరిస్తుంది.



ఏఎన్ఆర్ సినీ రంగంలో ఏడు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్న ప్రధాని మోదీ, తెలుగు చిత్రసీమను తీర్చిదిద్దడంలో ఆయన కీలకపాత్ర పోషించారని ప్రశంసించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తన సినిమాల ద్వారా ప్రతిబింబించడంలో ఏఎన్ఆర్ విశేషంగా రాణించారని పేర్కొన్నారు. చెన్నై నుంచి హైదరాబాద్‌కి తెలుగు చిత్రపరిశ్రమను మార్చడంలో ఆయన తీసుకున్న దృఢమైన నిర్ణయం, నేడు హైదరాబాద్‌ను గ్లోబల్ సినిమా హబ్‌గా నిలిపిందని ప్రధానమంత్రి గుర్తు చేశారు.

ఏఎన్ఆర్ కేవలం నటుడిగానే కాకుండా, విద్య, సాహిత్యం, ప్రజా సేవలోనూ విశేషమైన కృషి చేసిన గొప్ప వ్యక్తి అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన స్థాపించిన అన్నపూర్ణ స్టూడియోస్ సినీ నిర్మాణ కేంద్రంగా నిలవడమే కాకుండా, విద్యారంగానికి చేసిన సేవలలో భాగంగా గుడివాడలోని అక్కినేని నాగేశ్వరరావు కళాశాల వంటి అనేక విద్యా సంస్థలను అభివృద్ధి చేశారని పేర్కొన్నారు.

ప్రధాని మోదీ "మనకి బాత్" 117వ ఎపిసోడ్‌లో తపన్ సిన్హా, రాజ్ కపూర్‌లతో పాటు ఏఎన్ఆర్‌కు అర్పించిన నివాళిని మరోసారి గుర్తు చేశారు. భారతీయ సినిమా గొప్పతనాన్ని కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేస్తూ, ఈ ఏడాది భారత్‌లో వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్టైన్‌మెంట్ సమ్మిట్ ను నిర్వహించనున్నట్టు ప్రకటించారు.

తన తండ్రి ఏఎన్ఆర్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినందుకు హర్షం వ్యక్తం చేసిన నాగార్జున, ఆయన ప్రభావం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, పద్మవిభూషణ్ వంటి గౌరవాలు అందుకున్న ఏఎన్ఆర్ భారతీయ సినీ ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచే వ్యక్తి అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాగా, ఈ సమావేశం, భారతీయ చలనచిత్ర చరిత్రలో ఒక మహనీయ నటుడి సేవలను గౌరవించే కీలక ఘట్టంగా నిలిచింది.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 08, ఫిబ్రవరి 2025



## ఎమ్మెల్సీగా ఆలపాటి విజయం లాంఛనమే...

● విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్



**గుంటూరు, మహానాడు:** ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం సాధించడం లాంఛనమేనని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ నామినేషన్ సందర్భంగా గుంటూరులోని ఆలపాటి ఇంటికి రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తో కలిసి వెళ్లిన ఆయన.., ఆలపాటికి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం అభివృద్ధిపథంలో ముందుకు సాగాలంటే... కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆలపాటిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మరో మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మంత్రులు ఇరువురూ ఆలపాటితో ముచ్చటిస్తున్న సమయంలో కూటమి నేత వంగవీటి రాధ అక్కడకు వచ్చారు. తాజా రాజకీయ పరిస్థితులపై వీరంతా కొద్ది సమయం చర్చించారు. వంగవీటి రాధ కూడా ఆలపాటికి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.

## “420” అబద్ధపు హామీల పాపం.. 420 రోజుల చేతకాని పాలన శాపం..

● తెలంగాణలో రైతుల ఆత్మహత్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్



**హైదరాబాద్:** “420” అబద్ధపు హామీల పాపం ఫలితంగా..మాటలకందని మహా విషాదం.. తెలంగాణ చెల్లించిన భారీ మూల్యం.. 420 మంది రైతన్నల బలవన్మరణం. అసమర్థులు అధికారం పీఠమెక్కి.. అన్నదాతలను బలిపీఠం ఎక్కిస్తున్నారు.కన్నీటి సేద్యం చేయలేక.. భూములున్న కర్షకులే కాదు. కౌలు రైతులూ పిట్టల్లా రాలిపోతున్నారు. దేశానికే వెన్నుముకైన రైతులకు కుటిల కాంగ్రెస్ పాలనలో వరుస వెన్నుపోట్లు. ఓట్లనాడిచ్చిన హామీలకు లెక్కలేనన్ని తూట్లు

పదేళ్లలో పంజాబ్ నే తలదన్నే స్థాయికి తెలంగాణ..నేడు పెట్టుబడికి పత్తాలేదు.. దిగుబడికి దిక్కులేదు.రుణమాఫీని ఆగంచేసి..

పెట్టుబడి సాయానికి పాతరేసి.. ముంచేరోజులు తేవడంవల్లే ఈ అనర్థాలు.

చలనం లేని సీఎం, బాధ్యత లేని సర్కారు వల్లే మళ్లీ తెలంగాణ పల్లె కన్నీరుపెడుతోంది. మళ్లీ మరణమృదంగం మోగుతోంది. చేతనైతఇకనైనా సాగు సంక్షోభాన్ని తీర్చండి. అన్నదాతల ఆత్మహత్యల పరంపరను ఆపండి.

## శభాష్ దివ్య, మణికంఠ

● జాతీయ క్రీడల్లో ఏపీకి నాలుగో స్వర్ణం

● ప్రశంసించిన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి



**విజయవాడ, మహానాడు:** డెహ్రాడూన్ జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ ఖాతాలో నాలుగో స్వర్ణ పతకం సాధించడపై క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బీచ్ వాలీబాల్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు అత్యుత్తమ ప్రదర్శనతో పసిడి పతకం సాధించడం అభినందనీయమని జాతీయ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వైజాగ్ కి చెందిన క్రీడాకారులు దివ్య సాయి, మణికంఠ రాజును మంత్రి శుక్రవారం ప్రశంసించారు. జాతీయ క్రీడా పోటీల్లో క్రీడాకారులు మరిన్నీ పతకాల సాధించాలని ఈ సందర్భంగా మంత్రి కాంక్షించారు.

## ఐదేళ్ల విధ్వంసాన్నిచక్కదిద్దే బాటలోనే 7 నెలల పాలన

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**గుంటూరు, మహానాడు:** రాష్ట్రంలో అయిదేళ్ల వైసీపీ పాలన, జగన్ చేసిన నష్టం, విధ్వంసం చక్కదిద్దేబాటలోనే కూటమి పాలన సాగుతోందని చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. గడిచిన ఏడు నెలలుగా అదే లక్ష్యంగా ఒక్కొక్క వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిలో పెడుతున్నారని, మరోవైపు అభివృద్ధి,




సంక్షేమంలో ఏపీని దేశంలోనే తిరిగి మొదటి స్థానంలో నిలిపేందుకు చేస్తున్న కృషిలో ప్రజల మద్దతు కూడా ఎంతోకీలకమన్నారు. ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుక్రవారం గుంటూరు కలెక్టరేట్ లో నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆలపాటికి అభినందనలు తెలిపిన చీఫ్‌విప్ జీవీ రూ.లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగాలు వస్తున్న తరుణంలో ఆయన్ను గెలిపించడానికి పట్టభద్రులంతా చాలా సంసిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు కూడా అభివృద్ధి చేసే ప్రభుత్వం వెంటే ఉన్నారని పేర్కొన్నా రు.

## మాజీ ఎంపీ ఎంవీవీ ఆస్తుల జప్తు!

**- ఈడీ వెల్లడి**

**విశాఖపట్నం, మహానాడు:** విశాఖ హయగ్రీవ భూ మార్పిడి వ్యవహారంలో విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తో పాటు పలువురు ఆస్తులను ఈడీ జప్తు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం– 2002 ప్రకారం సీనియర్ సిటిజన్, అనాథ గృహ నిర్మాణాల కోసం హయగ్రీవ ఫార్మ్స్ , డెవలపర్స్ సంస్థకు కేటాయించిన 12.51 ఎకరాల భూ మార్పిడి పై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగా 42.03 కోట్ల విలువైన 14 స్థిర ఆస్తులతో పాటు రూ. 2.71 కోట్ల విలువైన ఆరు మొబైల్ ఆస్తులను జప్తు చేసింది. ఎమ్‌వివి బిల్డర్స్, హయగ్రీవ ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్, గద్దె బ్రహ్మాజీ, ఆయన భార్య, చిలుకూరి జగదీశ్వరుడు, చిలుకూరి రాధారాణి, హయగ్రీవ ప్రాజెక్ట్స్, వారణాసి దిలీప్‌లకు చెందిన ఆస్తులను జప్తు చేసింది. ఈ కేసుకు సంబంధించి మరింత దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ వెల్లడించింది.




## జగన్ 2.0 వద్దంటూ ప్రజల ఎదురు దండాలు!

● రూ.77 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశాం

● విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్



**అద్దంకి, మహానాడు:** బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో 56 మంది లబ్ధిదారులకు రూ.77 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి ఐసీయూలో పెట్టిన ఆరోగ్యశ్రీకి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఊపిరి పోసిందని చెప్పారు. జగన్ 1.0కే ప్రజలు బెంబేలెత్తి 11 సీట్లకే పరిమితం చేశారని విమర్శించారు. జగన్ 2.0 ఎంత దారుణంగా ఉంటుందో అని ప్రజలు ఆయనకు ఎదురు దండాలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు.

ప్రజలు ఇచ్చిన 11 సీట్లతో అయినా జగన్ రెడ్డి యుద్ధం చేయాలని చెప్పారు. పిరికి వాడిలా అసెంబ్లీలో మైకు ఇవ్వడం లేదని... సమయం ఇవ్వడం లేదని, ప్రతిపక్ష హెూదా ఇవ్వడం లేదని జగన్ కుంటి సాకులు చెబుతున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. 30 ఏళ్లు అధికారం అంటూ కలలు కనడం మానాలని హితవు పలికారు. జగన్ చేసిన ఆర్థిక నేరాలకు 30 ఏళ్ళు జైలు శిక్ష మాత్రం ఖాయమని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. రక్త సంబంధీకులు, ఆత్మ బంధువులే జగన్ క్యారక్టర్, క్యాపబులిటీని వేలెత్తి చూపుతున్నారని గుర్తు చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా... అడ్డంకులు సృష్టించినా... ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి ప్రకటించారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పత్రాలన్నీ ఫోన్‌లోనే...

● ప్రతి పౌరుడికీ డీజీ లాకర్

● వాట్సాప్‌లోనే ధ్రువపత్రాలు డౌన్ లోడ్

● డేటా అనుసంధానంతోనే పౌరులకు మెరుగైన సేవలు

● ఈ ప్రక్రియ సత్వరం పూర్తి చేయాలి

● ప్రతి శాఖలోను ఒక చీఫ్ డేటా టెక్నికల్ అధికారి అవసరం

● అధికారులకు ఐటీ, ఆర్టీజీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని ఆదేశాలు

**అమరావతి, మహానాడు:** రాబోయే రోజుల్లో పౌరులు తమకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలేవీ భౌతికంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉండబోదని, తమ మొబైల్ ఫోన్లోనే అన్ని పత్రాలు డిజిటల్ రూపేణా పొందుపరచవచ్చని, ఆ దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఐటీ, ఆర్టీజీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని తెలిపారు. దీనికోసం ప్రతి పౌరుడికి ప్రత్యేకంగా డీజీ లాకర్ సదుపాయం కల్పించున్నామన్నామని వెల్లడించారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల మధ్య డేటా అనుసంధాన ప్రక్రియ గురించి అన్నీ శాఖలు, విభాగాధిపతులతో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించింది.

ఈ సమావేశంలో భాస్కర్ కాటంనేని మాట్లాడుతూ ప్రభుత్వంలో ఇప్పటికీ కూడా ఒక సింగిల్ సోర్స్ ఆఫ్ డేటా అనేది లేదన్నారు. ఆయా శాఖల్లో చాలా డేటా ఉన్నప్పటికీ అది ఇప్పటికి కూడా ఒకచోట అనుసంధానం కాలేదని, దానివల్ల పౌరులకు ప్రభుత్వం అందించే సేవలు మరింత సమర్థవంతంగా అందించ డానికి సాంకేతిక అవరోధాలు ఏర్పడుతున్నాయన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగేపని లేకుండా పౌరులకు వారికి కావాల్సిన అన్ని సేవలు వారి చేతిలోని మొబైల్ ఫోన్ ద్వారానే అందించాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఆర్టీజీఎస్ ఒక పెద్ద డేటా లేక్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. దీనిద్వారా రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో ఉన్న డేటాను ఈ డేటా లేక్‌తో అనుసంధానం చేస్తామని, తద్వారా పౌరులకు డిజిటల్ సేవలు మరింత మెరుగ్గా అందించే సదుపాయం కల్పిస్తామన్నారు.

### స్మార్ట్ ఫోన్‌లోనే అన్ని సర్టిఫికెట్లు

పౌరులెవ్వరు కూడా తమకు ప్రభుత్వం నుంచి కావాల్సిన సర్టిఫికెట్ల కోసం ఏ కార్యాలయానికి, ఏ అధికారి వద్దకు వెళ్ల కుండా కేవలం తమ వద్ద ఉన్న సెల్ ఫోన్ ద్వారనే ఇట్టే సులభంగా పొందేలా చేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు.



ఇందులో భాగంగా ప్రభుత్వం ఇటీవలే వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభించిందన్నారు. దీనికోసం మెటా సంస్థతో ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుందని తెలిపారు. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 161 సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు కావాల్సిన అన్ని సేవలు, అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు ఇందులో పొందే సదుపాయం కల్పింస్తుం దన్నారు. ఒక పౌరుడు తనకు సంబంధించిన విద్యార్హత, కుల, ఆదాయ, జనన, మరణ తదితర ధ్రువీకరణ పత్రాలన్నీ కూడా వాట్సాప్ ద్వారానే డౌన్ లోడు చేసుకోవచ్చని ఎవరి వద్దకు తిరగాల్సిన పని ఉండబోదన్నారు.

అలాగే రాబోయే రోజుల్లో పౌరులు తమకు సంబంధించి సర్టిఫికెట్లను భౌతికంగా తమతో తీసుకెళ్లాల్సిన అవసరం ఉండబోతదని, తమ చేతిలోని మొబైల్ ఫోన్లోనే ఆ సర్టిఫికెట్లను డౌన్ లోడు చేసుకుని పొందుపరచవచ్చన్నారు. ఆ దిశగా వాట్సాప్ గవర్నెన్స్ ను ప్రభుత్వం అమలు చేయనున్నదన్నారు. ప్రతి పౌరుడికి డిజీ లాకర్ సదుపాయం కల్పించి, వారు తమ ధ్రువీకరణ పత్రాలు అందులో భద్రపరచుకునేలా చేస్తామన్నారు. వాట్సాప్ ద్వారానే పౌరులు చెల్లింపులు కూడా నిర్వహించుకునే సదుపాయం కల్పిస్తున్నామన్నారు.

వాట్సాప్ ద్వారానే పౌరులు ప్రభుత్వానికి అర్జీలు, ఫిర్యాదులు చేయొచ్చన్నారు. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ సేవలను తెలుగు, ఇంగ్లీషు భాషల్లో అందిస్తున్నామని, అయితే సరిహద్దు రాష్ట్రాల్లోని జిల్లాల్లో ఉన్న ప్రజల సౌకర్యర్థం ప్రాంతీయ భాషలైన తమిళం, ఒరియా, కన్నడ భాషల్లో కూడా అందించే ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. చదువు రాని పౌరులు తాము నేరుగా వాయిస్ ద్వారానే ప్రభుత్వానికి ఫిర్యాదు, అర్జీలు సమర్పించే అవకాశం కూడా కల్పించడానికి ప్రయత్నాలు ప్రభుత్వం చేస్తోందన్నారు. అయితే ఇవన్నీ పౌరులకు మరింత మెరుగ్గా అందించాలంటే శాఖల మధ్య డేటా అనుసంధానం వేగవంతంగా జరగాల్సిన అవసరముందని చెప్పారు.

### సీడీటీఓను నియమించుకోండి

ప్రతి శాఖలోనూ ఒక చీఫ్ డేటా టెక్నికల్ ఆఫీసర్ (సీడీటీఓ)ను నియమించుకోవాలని భాస్కర్ కాటంనేని అధికారులకు సూచించారు. తమ శాఖలో అలాంటి వ్యక్తిని రెండు రోజుల్లోపు గుర్తించి వారికి ఈ బాధ్యతలు అప్పజెప్పాలన్నారు. అదే విధంగా ఆర్టీజీఎస్ డేటా లేక్ తో ఆయా శాఖలు తమ వద్ద ఉన్న డేటాను షేర్ చేసుకునే ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి చేయాలని కోరారు.

ఈ సమావేశంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ ముఖ్య కార్యనిర్వహణదాధికారి కె. దినేష్ కుమార్, డిప్యూటీ సీఈఓ మాధురి, పౌరసరఫరాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సౌరవ్ గౌర్, ఐజీ టెక్నికల్ సర్వీస్ శ్రీకాంత్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ వీరపాండ్యన్, జీఎస్‌డబ్ల్యూ డైరెక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన హరీష్ కుమార్ గుప్తాని శుక్రవారం మంగళగిరి డీజీపీ కార్యాలయంలో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఇతర నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టినందుకు ఏపీ జేఏసీ అమరావతి పక్షాన శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడా ప్రోత్సాహకాలు విడుదల చేసిన ఏపీ ప్రభుత్వానికి, ప్రోత్సాహకాల విడుదలకు కృషి చేసిన శాప్ చైర్మన్ రవినాయుడికి ఆంధ్రప్రదేశ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు, పారా స్పోర్ట్స్ క్రీడాకారులు కృతజ్ఞతలు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలిసి విజయవాడలోని శాప్ కార్యాలయంలో రవినాయుడిని వారంతా మర్యాదపూర్వకంగా కలిశారు.





## వైసీపీ షాక్..

**టీడీపీలో చేరిన మునిసిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు..**

**గుంటూరు,మహానాడు:** ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు సమక్షంలో వినుకొండ మునిసిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి(వైసిపి), ఆయన సతీమణి 30వ వార్డు కౌన్సిలర్ షేక్. షకీల, వైసిపి కౌన్సిలర్లు హేమలత(27వ వార్డ్), పాల్వాది ప్రసన్న ఆంజనేయులు (18వ వార్డ్), రెడ్డి నాగ పద్మ (9వ వార్డ్) వైసిపిని వీడి టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన కౌన్సిలర్లను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు టిడిపి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగిందని మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు తెలిపారు. వినుకొండ పట్టణ అభివృద్ధి చీఫ్ విప్, శాసనసభ్యులు జివి ఆంజనేయులు గారి సాధ్యమని అన్నారు.

కూటమి అంటే అభివృద్ధి.. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే సీఎం చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని ఆశించి ఈరోజు వైసిపి నుండి టిడిపిలో చేరిన కౌన్సిలర్లకు, వైసిపి నాయకులకు ప్రభుత్వ చీఫ్ విప్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

డిజిటల్ న్యూస్ పేపర్
శనివారం 08, ఫిబ్రవరి 2025

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

## డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 3,21,041

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1న ప్రారంభమైన మన
మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న
మా అభిమాన పాఠకుల
అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్
మార్తి సుబ్రమణ్యం
సంపాదక సారథ్యంలో





బోడెపూడి సుబ్బారావు (BSR)
సారథ్యంలో



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 06, ఫిబ్రవరి 2025 ||





## పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణకి సత్కారం

తెలుగు చలనచిత్ర పరిశ్రమకు విశేష సేవలు అందించిన ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే, బసవతారకం కాన్సర్ హాస్పిటల్ చైర్మన్ నందమూరి బాలకృష్ణకి భారత ప్రభుత్వంచే పద్మ భూషణ్ పురస్కారం ప్రకటించబడిన సందర్భంగా, తెలుగు చిత్ర పరిశ్రమ ప్రముఖులు నందమూరి బాలకృష్ణ నివాసానికి వెళ్లి ఆయనకు అభినందనలు తెలిపారు.

తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పి భరత్ భూషణ్ , సెక్రటరీ కె ఎల్ దామోదర్ ప్రసాద్, కోశాధికారి తుమ్మల ప్రసన్న కుమార్ అలాగే తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ కె ఎల్ దామోదర్ ప్రసాద్, సెక్రటరీ తుమ్మల ప్రసన్న కుమార్, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి, తెలంగాణ స్టేట్ ఫిలిం ఛాంబర్ అఫ్ కామర్స్ సెక్రటరీ కె అనుపమ్ రెడ్డి, తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్ కుమార్ , సెక్రటరీ కె అమ్మిరాజు, కోశాధికారి వి సురేష్, తెలుగు సినీ రైటర్స్ అసోసియేషన్ సెక్రెటరీ ఉమర్జీ అనురాధ, తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ ప్రెసిడెంట్ కె అమ్మిరాజు, చిత్రపురి హిల్స్ ప్రెసిడెంట్ & తెలుగు సినీ,టీవీ జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ సెక్రటరీ వల్లభనేని అనిల్ కుమార్, మొత్తం ఇండస్ట్రీ నుండి 10 అసోసియేషన్స్ అండ్ యూనియన్స్ కలిసి నందమూరి బాలకృష్ణని కలసి ఆయనకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. వారు అంతా కలిసి త్వరలో నందమూరి బాలకృష్ణ గారిని సన్మానించేందుకు తెలుగు చిత్ర పరిశ్రమ ఘనంగా ఏర్పాట్లు చేస్తునట్టు తెలియజేశారు.



## ‘తెలుసు కదా’ రొమాంటిక్ పోస్టర్

స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ ఈరోజు తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు, ఈ సందర్భంగా ఆయన మోస్ట్ ఎవైటెడ్ మూవీ ‘తెలుసు కదా’ నుండి ఒక బ్రాండ్ న్యూ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో సిద్ధు తన మోస్ట్ స్టైలిష్ అవతార్ లో అదరగొట్టారు. బర్త్ డే స్పెషల్ పోస్టర్ లో, సిద్ధు, శ్రీనిధి శెట్టి మధ్య రొమాంటిక్ మూమెంట్, మరో సైడ్ రాశి ఖన్నా నుదిటిపై ముద్దు పెడుతూ కనిపించారు. పోస్టర్ ఇద్దరు అమ్మాయిలతో హీరో ప్రేమకథను ప్రజెంట్ చేస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై క్యురియాసిటీని క్రియేట్ చేసింది. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన డైరెక్టర్ గా పరిచయం అవుతున్న మూవీ ‘తెలుసు కదా’ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమాలో వైవా హర్ష కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జ్ఞాన శేఖర్ బాబా సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. థమన్ ఎస్ సంగీతం సమకూరుస్తున్నారు. జాతీయ అవార్డు గెలుచుకున్న ప్రొఫెషనల్ నవీన్ నూలి ఎడిటర్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. శీతల్ శర్మ కాస్ట్యూమ్ డిజైనర్.




## ‘లైలా’ చూసి మీ ఛాతీ చపాతీ అవుతుంది: విశ్వక్ సేన్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటించిన లేటెస్ట్ మూవీ ‘లైలా’. ఈ సినిమాను దర్శకుడు రామ్ నారాయణ్ పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయ్యింది. విశ్వక్ సేన్ తొలిసారి ఈ సినిమాలో లేడీ గెటప్‌లో కనిపిస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఇప్పటికే రిలీజ్ అయిన ఈ మూవీ పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ఈ అంచనాలను పెంచాయి. సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో చేస్తున్న టీమ్ తాజాగా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఏ మాల్‌గా చాలా గ్రాండియర్‌గా నిర్వహించింది. ఈ ఈవెంట్‌లో ట్రైలర్ రిలీజ్ చేసి ఆడియన్స్‌లో మరింత హైప్ పెంచేసింది. ట్రైలర్ విషయానికి వస్తే.. లేడీస్ బ్యూటీ పార్లర్ నడుపుతున్న సోనూ మోడల్(విశ్వక్) అనుకోకుండా స్థానిక ఎమ్మెల్యే హత్య కేసులో ఇరుక్కున్నట్లు తెలుస్తుంది. దీంతో ఎమ్మెల్యే మనుషులు అతడు దొరికితే చంపేందుకు ప్రయత్నిస్తుంటారు. ఈ పరిస్థితిలో తన ప్రాణాలను రక్షించుకోవడానికి, సోనూ లైలాగా మారిపోతాడు. అయితే, లేడీ గెటప్‌లో మారిన విశ్వక్‌కు ఎదురైన అనేక సంఘటనలు ఏంటి? ఎమ్మెల్యే హత్య కేసుకు, సోనూకి సంబంధం ఏంటి? అనే విషయాలు సినిమాలో ఆసక్తికరంగా ఉండనున్నాయి. సోను మోడల్ పాత్రలో విశ్వక్ సేన్ యాక్టింగ్.. అతడు చేసే కామెడీ ఆకట్టుకోనుందని ఈ ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ట్రైలర్ మొత్తం ఎట్రాక్టింగ్ డైలాగ్‌లతో నింపారు. ఈ ట్రైలర్ ఆద్యంతం ఫన్ రైడ్‌గా ఉంది. లేడీ పాత్రలో విశ్వక్ సేన్ చేసే అల్లరి థియేటర్లలో ప్రేక్షకులు పడిపడి నవ్వేలా చేస్తుందనడంలో సందేహం లేదు. అటు హీరోయిన్ ఆకాంక్ష శర్మ తన గ్లామర్ షోతో యూత్‌ను ఆకట్టుకోనుంది.

లియోన్ జేమ్స్ సంగీతం మేజర్ అసెట్‌గా రానున్న ఈ సినిమాపై ఈ ట్రైలర్ అంచనాలను రెట్టింపు చేసింది. హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. “ట్రైలర్ అందరికీ నచ్చిందని అనుకుంటున్నా. థియేటర్లలో మీరు నవ్వి నవ్వి మీ ఛాతీ చపాతీ కావాలని డిసైడ్ అయ్యాం. కచ్చితంగా లైలా మిమ్మల్ని బాగా నవ్విస్తుంది. ట్రైలర్ బయటకు వచ్చింది కాబట్టి.. నాకంటే ట్రైలర్ ఎక్కువ మాట్లాడాలని అనుకుంటున్నా. ప్రీరిలీజ్ ఈవెంట్ ఉంది కాబట్టి అక్కడ మాట్లాడుతా. లైలా నుంచి నెక్స్‌ట్ అటక్ పటక్ రిలీజ్ అవుతుంది. ఆ సాంగ్ నేనే రాశా. అది కూడా మీకు నచ్చుతుంది. ఫిబ్రవరి 14న అందరూ థియేటర్లలో కలుద్దాం.” అని చెప్పారు.

## ‘రానా నాయుడు 2’తో అలరించేందుకు రెడీ అయిన నెట్ ఫ్లిక్స్

నెట్ ఫ్లిక్స్ నుంచి ఈ ఏడాది అద్భుతమైన వెబ్ సిరీస్, అందరినీ అలరించే కంటెంట్ రాబోతోంది. ఈ ఏడాదిలో తమ నుంచి వచ్చే ప్రాజెక్టుల వివరాల్ని నెట్ ఫ్లిక్స్ ప్రకటించింది. కామెడీ, ఫ్యామిలీ, యాక్షన్, రొమాన్స్, స్పోర్ట్స్ డ్రామా ఇలా అన్ని జానర్లను టచ్ చేస్తూ నెట్ ఫ్లిక్స్ ఈ ఏడాది ఊహించని స్థాయిలో వినోదాన్ని పంచేందుకు రెడీగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా 700 మిలియన్లకు పైగా వీక్షకులను సంపాదించుకున్న నెట్ ఫ్లిక్స్ ఈ ఏడాది సరి కొత్త కంటెంట్‌ను పంచేందుకు రెడీ అయింది.




మాధవన్, సిద్దార్థ్, నయనతార, మీరా జాస్మిన్ వంటి అద్భుతమైన తారాగణంతో ఎస్. శశికాంత్ ‘టెస్ట్’ అనే సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు. ఏ వైనాట్ స్టూడియో బ్యానర్ మీద చక్రవర్తి రామచంద్ర, ఎస్. శశికాంత్ నిర్మిస్తున్నారు. జీవితమే ఓ ఆట అనే కాన్సెప్ట్‌తో ఈ ‘టెస్ట్’ రాబోతోంది. భిన్న మనస్తత్వాలు, భిన్న దారుల్ని ఎంచుకున్న ముగ్గురు వ్యక్తుల జీవితాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. లవ్, అంతులేని కలలు, లక్ష్యాలు, కోరికలు, క్రికెట్ వంటి ఎమోషన్స్ చుట్టూ ఈ సిరీస్ తిరుగుతుంది. నెట్ ఫ్లిక్స్‌తో కలిసి ఈ సిరీస్‌ను అందరికీ అందిస్తుండటం ఆనందంగా ఉందని నెట్ ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనిక షెర్గిల్ అన్నారు.



## ఎన్.శంకర్ తనయుడు దర్శకత్వంలో లవ్‌స్టోరీ

ఎన్.శంకర్.. ఈ పేరు వినగానే అందరికి శ్రీరాములయ్య,ఎన్‌కౌంటర్, జయం మనదేరా, భద్రాచలం, జై భోలో తెలంగాణ వంటి సంచలన విజయాలు సాధించిన చిత్రాలు మన కళ్ల ముందు మెదులుతాయి. అప్పట్లో ఈ చిత్రాలు ఎలాంటి ప్రేక్షకాదరణ పొందాయో అందరికి తెలిసిందే. తాజాగా ప్రముఖ దర్శకుడు ఎన్.శంకర్ తనయుడు దినేష్‌మహీంద్ర తండ్రి బాటలో దర్శకత్వ ప్రతిభను నిరూపించుకోవడానికి రెడీ అయ్యాడు. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో దర్శకత్వ విభాగంలో శిక్షణ పొంది, స్క్రీన్‌ప్లే విషయంలో పలు కోర్సులను పూర్తిచేశాడు దినేష్‌మహీంద్ర. త్వరలోనే దినేష్ మహీంద్ర దర్శకత్వంలో ఓ ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ రూపుదిద్దు కోబోతుంది. నూతన తారలతో పాటు నూతన టెక్నిషియన్లను పరిచయం చేస్తూ యూత్‌ఫుల్ ఫీల్ గుడ్ లవ్‌స్టోరీగా రూపొందనున్న ఈ చిత్రాన్ని “ఆరెక్స్ క్రియేషన్స్ “ సంస్థ



నిర్మిస్తుంది..షూటింగ్ ఏప్రిల్‌లో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పాటల రికార్డింగ్స్ జరుగుతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తారు.

## ‘మోగ్లీ 2025’ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం

తన తొలి చిత్రం ‘బబుల్ గమ్’తో అందరినీ ఆకట్టుకున్న రోషన్ కనకాల తనదైన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. సహజమైన నటన ఫ్రెష్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో అలరించిన రోషన్ ఇప్పుడు కథల ఎంపికలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాడు. ప్రస్తుతం ఆయన ‘మోగ్లీ 2025’ చిత్రంలో నటిస్తున్నారు. కలర్ ఫోటోతో జాతీయ అవార్డును గెలుచుకుని యంగెస్ట్ దర్శకుడిగా గుర్తింపు పొందిన సందీప్ రాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆసక్తికరమైన టైటిల్, ఫస్ట్ లుక్ తో ఈ సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేపింది. విభిన్నమైన కథనాలకు పేరొందిన సందీప్ రాజ్ రోషన్‌ను కొత్త కోణంలో చూపించనున్నారని చిత్ర పరిశ్రమలో మంచి అంచనాలు ఉన్నాయి. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ కాంటెంపరరీ లవ్ స్టోరీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై %u+% విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ నెలలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మోగ్లీ తర్వాత రోషన్ మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. 2025 రెండో అర్ధభాగంలో ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. కథల ఎంపిక విషయంలో ఆయన చూపుతున్న చిత్తశుద్ధి సంఖ్య కంటే నాణ్యతను ప్రాధాన్యమిస్తూ సాగే ఆయన నిర్ణయాలు సినిమాపై ఉన్న ఆసక్తిని ప్రతిబింబిస్తున్నాయి. ప్రముఖ నటుడిగా ఎదుగుతున్న రోషన్ కనకాల ఒక్కొక్క అడుగుగా తనదైన ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంటున్నాడు.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144